ప్రజాశక్తి

గురువారం 20 జులై 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

'అణుకు'కు దారేది...!



- డోలి మోతల బాధ తీరేదెలా?
- గిరిజనుల పట్ల ఎడతెగని నిర్లక్ష్యం
- ఊర్లో పాఠశాలలేక అవస్థలు
- పట్టని ప్రభుత్వ యంత్రాంగం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, కోటవురట్ల విలేకరి

జిల్లాలోని పాయకరావుపేట నియోజకవర్గ పరిధి కోటవురట్ల మండలం, గొట్టువాడ పంచాయతీ అణుకు గిరిజనుల (పిటిజి) బాధలు ఏజెన్సీ ప్రాంతంలోని మారుమూల గిరిజనుల బాధలను తలపిస్తున్నాయి. నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామం కావడంతో ప్రభుత్వ సదుపాయాలు, సౌకర్యాలు వీరికి వర్తించడంలేదు. పెద్దపెద్ద వర్షాలొస్తే అణుకుకు ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోతాయి. కొన్ని దశాబ్దాల క్రితం చింతపల్లి మండలం సరమండ నుంచి కొన్ని పిటిజి కుటుంబాలు అణుకు వచ్చి, పోడు వ్యవసాయం చేసుకొని బతుకుతున్నాయి. ప్రస్తుతం 52 కుటుంబాలు ఇక్కడ నివసిస్తున్నాయి. అణుకు నుంచి గొట్టివాడకు రోడ్డు సౌకర్యంలేదు. గర్భిణీలు, రోగులను ఆస్పత్రికి తీసుకెళ్లాల్సివస్తే పగలైనా, ఏ అర్ధరాత్రైనా డోలికట్టి మోసుకొని కిందకు రావడం తప్ప మరోమార్గంలేదు. తమ పంటలు అమ్ముకోవాలన్నా, కుటుంబ అవసరాలకు కింది నుంచి సరుకులు తెచ్చుకోవాలన్నా అణుకు నుంచి గొట్టువాడ రోడ్డు వరకు రెండు కొండల మధ్యనున్న తేలిన రాళ్లు, పెద్దపెద్ద గతుకలు, ఎత్తుపల్లాలు, మధ్యలో నీరుపారుతున్న కల్వర్టులు, నీళ్ల చేరిన గుంతలు దాటుకొని ఐదు కిలోమీటర్లు నడుచుకొని వెళ్లిరాకతప్పదు. ఐదేళ్లు నిండిన పిల్లలు ఇదే మార్గంలో గొట్టువాడ ప్రాథమిక పాఠశాలకు ప్రతి రోజూ పది కిలోమీటర్లు నడుచుకొనివెళ్లి వస్తున్నారు. ఆరు నుంచి పది తరగతుల పిల్లలు కొందరు రెండువైపులా 20 కిలోమీటర్ల దూరంలోని కోటవురట్ల పాఠశాలకు వెళ్లివస్తున్నారు.

రోడ్డు నిర్మాణం, ఊర్లో ప్రాథమిక పాఠశాల ఏర్పాటుచేయాలని గిరిజన కుటుంబాలన్నీ ఎమ్మెల్యేలు, ఎంపీ, అధికారులను ఎంతో కాలంగా కోరుతున్నాయి. వినతిపత్రాలు సమర్పిస్తూనేవున్నాయి. ఇవి ఎప్పటికీ పరిష్కారం కాకపోవడంతో అణుకు గిరిజనులు గొట్టువాడ రోడ్డు వద్ద నాన్‌షెడ్యూల్ గిరిజన సంఘం నేతృత్వంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం నాటికి 12వ రోజుకు చేరుకున్నాయి. 'ప్రజాశక్తి' అణుకు వెళ్లినప్పుడు మరికొన్ని సమస్యలు వెలుగుచూశాయి. ఎంతోకాలం క్రితం నిర్మించిన ఇళ్ల కొన్ని కూలిపోయాయి. మరికొన్ని వర్షాలకు కారిపోతున్నాయి. గాలికి వర్షపు నీరు ఇంట్లోకి రాకుండా సీందరి జంబో, వంతలి సోనా చీరలు అడ్డుపెట్టుకున్నారు. కొంతమంది ఇళ్లపైనా

మిగతా 2లో..



సమావేశంలో మాట్లాడుతున్న వీఎంఆర్‌డిఎ జాయింట్ కమిషనర్ రవీంద్ర

కీలక దశలో వీఎంఆర్‌డిఎ ప్రాజెక్టులు

- రూ.175 కోట్లతో పేదలందరికీ జగనన్న ఇళ్లు
- వుడా పరిధిలో 83 లే -అవుట్లు 1,41,654 ప్లాట్లు !
- వీఎంఆర్‌డిఎ జాయింట్ కమిషనర్ రవీంద్ర, సెక్రటరీ రంగయ్య

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖపట్నం మెట్రో రీజనల్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డిఎ) పరిధిలో పలు కీలక ప్రాజెక్టులు ముందుకు సాగుతున్నాయని వుడా జాయింట్ కమిషనర్ రవీంద్ర వెల్లడించారు. బుధవారం సాయంత్రం వీఎంఆర్‌డిఎ కాన్ఫరెన్సు హాలులో కార్యదర్శి రంగయ్య, ఇంజినీరింగ్ ఉన్నతాధికారులతో పాటు నిర్వహించిన మీడియా సమావేశంలో పలు అంశాలను ప్రస్తావించారు. జగనన్న 1 సెంటు లే-అవుట్లు ప్రగతి పథంలో ఉన్నాయని, 4825 ఎకరాల్లో రూ.175కోట్లతో లక్షా 41వేలా 654 ప్లాట్లను ఏర్పాటుచేశామని తెలిపారు. ఈ లే-అవుట్లకు భూములిచ్చిన రైతులకు రూ.20 కోట్లతో లే-అవుట్లను నిర్మించి అందజేస్తున్నామన్నారు. ఎంఐజి లే-అవుట్‌లకు సంబంధించి భోగాపురం చోడిపల్లి వద్ద కొంత సమస్య ఉందని, రఘుమండ, పాలవలసలో పనులు క్లియర్ చేస్తున్నామని చెప్పారు. వీఎంఆర్‌డిఎ కీలక ప్రాజెక్టుల్లో నగరం నడిబొడ్డున 11 ఫ్లోర్ల మల్టీలెవెల్ పార్కింగ్, కమర్షియల్ వినియోగం కోసం రూ.80కోట్లతో నిర్మిస్తున్నామని, ఈ డిసెంబరు నాటికి పనులు పూర్తికానున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు ఎకరా 35 సెంట్లలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీంట్లో 430 కార్లు, 400 టూ వీలర్లు, 5 ఫ్లోర్లలో పార్కింగ్ చేసుకోవచ్చన్నారు.

ఎక్కడెక్కడ ప్లాట్లు?

జగనన్న ఎంఐజి స్మార్ట్ టౌన్‌షిప్‌లు విజయనగరంలోని నెల్లిమర్ల రఘుమండలో 287 ప్లాట్లు 22.50 సెంట్లలోనూ, గజపతినగరం మండలం జియ్యన్నవలసలో 12.31

మిగతా 2లో..

చెత్త సేకరణ ఛార్జీల వసూలుపై ఒత్తిడి తగదు

▶ వార్త 2లో..

ఆర్థిక ఇబ్బందులతో దంపతుల ఆత్మహత్య

▶ వార్త 3లో..

చందనాడ దళితుల భూములకు నష్టపరిహారం చెల్లించాలి : లోకనాథం

▶ వార్త 8లో..



ఎన్నికైన జివిఎంసి స్థాయీ సంఘం సభ్యులతో వైసిపి నాయకులు

జివిఎంసి స్థాయీ సంఘం ఎన్నికల్లో వైసిపి విజయం

-10 మంది సభ్యులూ గెలుపు

-అధికార పార్టీకికి 62 ఓట్లు ఉంటే అభ్యర్థులకు 63, 64, 66 చొప్పున ఓట్లు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

జివిఎంసి స్థాయీ సంఘం ఎన్నికలలో వైసిపి కార్పొరేటర్లు విజయం సాధించారు. ఈ ఎన్నికల బరిలో 20 మంది అభ్యర్థులు (వైసీపీ, టిడిపి) పోటీలో నిలిచారు. ఎన్నికలలో గెలుపొందిన వైసిపి కార్పొరేటర్లలో ఉరికిటి నారాయణరావుకు 64 ఓట్లు, అక్రమాని పద్మకు 64 ఓట్లు, పీలా

మిగతా 2లో..

నిబంధనలకు లోబడే అప్పు పురంధేశ్వరి వ్యాఖ్యలపై మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలకు లోబడే అప్పు చేస్తోందని, తెచ్చిన ప్రతి రూపాయీ ప్రజా సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి మాత్రమే ఖర్చు పెడుతున్నట్లు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అప్పులపై దర్యాప్తు జరిపిస్తామని, ఈ విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖ దృష్టికి తీసుకెళ్తామని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి చేసిన వ్యాఖ్యల గురించి మీడియా ప్రతినిధులు బుధవారం జివిఎంసిలో మంత్రి వద్ద ప్రస్తావించగా ఆయన స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఒకపక్క ప్రజా సంక్షేమాన్ని, మరోపక్క రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ముందుకెళ్తోందన్నారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బిజెపి కలిసుందని, ఆ సమయంలో చేసిన అప్పు గురించి చిన్నమ్మ ఎందుకు అడగడంలేదని ప్రశ్నించారు.

ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార కేసుల విచారణ వేగవంతం

విశాఖ కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార కేసుల్లో సత్వర పరిష్కారం కోసం విచారణను వేగవంతం చేయాలని పోలీస్, రెవెన్యూ అధికారులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ నూతన సభ్యులతో బుధవారం ఈ సంవత్సరం మొదటి, ద్వితీయ త్రైమాసిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని, బాధితులకు సత్వర న్యాయం ద్వారా ప్రజల్లో కేసుల పరిష్కారం పట్ల నమ్మకం ఏర్పరచాలని సూచించారు. ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను, కారణాలను పోలీస్ అధికారులతో చర్చించి, సుదీర్ఘంగా పరిష్కారానికి నోచుకోని కేసులపై వెంటనే దృష్టిపెట్టాలన్నారు. ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ యాక్ట్ (పీఓఏ), ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ (పీసీఆర్) చట్టాల కింద నమోదైన ఎస్‌సి, ఎస్‌టి పెండింగ్ కేసులను సకాలంలో పరిష్కరించాలన్నారు. అట్రాసిటీ కేసులలో బాధితులకు చెల్లించే పరిహారంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఏడాది జిల్లాలో ఇప్పటివరకు 92 కేసులలో 88 మంది బాధితులకు రూ.1.15 కోట్ల పరిహారం చెల్లించినట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 95 కేసులు అండర్ ఇన్వెస్టిగేషన్లో ఉండగా, 679 కేసులు పెండింగ్ ట్రయల్ దశలో ఉన్నాయని తెలిపారు. అత్యధికంగా కుల ధ్రువీకరణ పత్రాలు పెండింగ్ ఉన్నాయని, వాటి జారీలో ఆర్‌డిఒలు, తహశీల్దార్లు అలసత్వాన్ని ప్రదర్శించవద్దని చెప్పారు. జిల్లాలో ఏసీపీల పరిధిలో ఎస్‌సి, ఎస్‌టి కేసులు 2013 నుంచి 2023 వరకు 97 కేసులు పోలీసు శాఖ ద్వారా విచారణలో ఉన్నాయని, ఈ కేసుల విచారణను సత్వరం పూర్తి

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

'అణుకు'కు దారేది...!

పెంకు ఇళ్లులు కారకుండా పరాజాలు కప్పుకున్నారు. ఇంకొందరు ఇంట్లో చేరిన నీటిని గుడ్డతో ఒత్తుకొని బయటపిండుతున్నారు. వీరంతా జగనన్న ఇళ్ల కోసం దరఖాస్తు చేసినా ఇళ్ల స్థలం ఇవ్వలేదు, ఇళ్లు కేటాయించలేదు. అడిగితే జాబితాలో పేరుందని చెబుతున్నారు తప్ప ఇళ్లు ఇవ్వలేదని గిరిజనులు వాపోయారు.

ఊర్లోని నీళ్ల ట్యాంకు సోలార్ ప్యానల్ పాడై నెలలవుతున్నా మరమ్మతుచేయలేదు. కరెంట్ ఉన్నప్పుడు ట్యాంకు నుంచి కుళాయి నీరు వస్తోంది. కరెంట్ పోతే తాగునీరు రావడంలేదని గిరిజన మహిళలు చెబుతున్నారు. వేసవిలో స్నానాలకు కూడా ఇబ్బందిపడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం గిరిజన కుటుంబాలకు ఇచ్చిన పట్టా భూములకు తోడు మరికొంత పోడు వ్యవసాయం చేసుకొని చోలు, కొర్రలు, వరి పండిస్తున్నారు. జీడిమామిడి తోటలు సాగుచేస్తున్నారు. ఈ పంటలు అమ్ముకుందామన్నా, రేషన్ సరుకులు తెచ్చుకుందామన్నా ఐదు కిలోమీటర్ల దూరంలోని గొట్టివాడ మోసుకొని నడచివెళ్తున్నారు. పిటిజిలకు ఏ ఒక్కరికీ అంత్యోదయ అన్నయోజన కార్డు మంజూరుచేయలేదు. ప్రాథమిక వైద్యం చేసేందుకు, అవగాహన కల్పించేందుకు కనీసం ఆశా కార్యకర్తను కూడా నియమించలేదు.

ఐదు కిలోమీటర్ల దూరంలోని గొట్టువాడ నడిచివెళ్లలేరని తమ ఐదేళ్లను పిల్లలను పాఠశాలకు పంపించడంలేదు. ఐదు కిలోమీటర్లు నడిచివెళ్లలేడని తన ఐదేళ్ల అబ్బాయి జాకూబ్‌ను పాఠశాలకు పంపించడంలేదని తల్లి గమ్మెలి లింగమ్మ తెలిపింది. పాఠశాలలకు వెళ్లలేని పిల్లలు ఆరుగురు వరకు ఊర్లో ఉన్నారు. పెద్ద వర్షాలొస్తే గెడ్డనీరు ఎక్కువగా ప్రవహిస్తే రాకపోకలు నిలిచిపోతాయి. ఆ సమయంలో అనారోగ్యంపాలైనా బయటకు తీసుకెళ్లలేక పసరమందులు వాడతామని గిరిజనులు అంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఊరుకు రోడ్డు, పాఠశాల ఇవ్వాలని, ఇళ్లు మంజూరుచేయాలని గిరిజన మహిళలు గమ్మెల సుందరి, గమ్మెల బంగారమ్మ కోరుతున్నారు. గిరిజన గ్రామం అణుకుకు మౌలిక సదుపాయాలు కల్పించి గిరిజనులను ఆదుకొనే వరకు పోరాటం కొనసాగిస్తామని నాన్‌షెడ్యూల్ గిరిజన సంఘం నాయకులు డేవిడ్‌రాజు తెలిపారు.

కీలక దశలో వీఎంఆర్‌డిఎ ప్రాజెక్టులు

ఎకరాల్లో 152 ప్లాట్లు, గరివిడి మండలంలోని 21.30 ఎకరాల్లో 272 ప్లాట్లు, విశాఖపట్నం జిల్లా ఆనందపురంలో పాలవలస 1, 2లో 76.96 ఎకరాల్లో 446 ప్లాట్లు, చోడవరం మండలంలోని అడ్డూరు వద్ద 20 ఎకరాల్లో 165 ప్లాట్లు, అనకాపల్లి మండలం అచ్యుతాపురం, భోగాపురం మండలం చోడిపల్లిలో 51.89 ఎకరాల్లో 189 ప్లాట్లు మొత్తంగా 204.96 ఎకరాల్లో 1505 ప్లాట్లు నిర్మిస్తున్నామన్నారు.

పలు ప్రాజెక్టులు వివిధ దశల్లో...

కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణాల విషయానికొస్తే విశాఖ ఎంపీ నిధులు రూ.2కోట్లు, వీఎంఆర్‌డిఎ నిధులు రూ.3.95కోట్లతో 1000 మందికి సరిపడా జి ప్లస్ 1 ఆడిటోరియాన్ని పెందుర్తి మండలం చీమలపల్లి గ్రామంలో నిర్మిస్తున్నామని తెలిపారు. ఎంపీ నిధులు రూ.2కోట్లు, వీఎంఆర్‌డిఎ నిధులు రూ.4.87 కోట్లతో ఎండాడ వద్ద 1000 మంది సామర్థ్యం కలిగిన ఆడిటోరియం నిర్మాణంలో ఉందన్నారు. ఎన్ఎడి వద్ద రూ.28కోట్లతో నిర్మిస్తున్న ఆర్‌ఒబి ప్రాజెక్టు 2024 జనవరి నాటికి పూర్తికానుందన్నారు. ఈ బ్రిడ్జి కొన్ని సాంకేతిక కారణాల వల్ల జాప్యం జరిగిందని చీఫ్ ఇంజినీరు వెల్లడించారు. ఎంజిఎం పార్కు (విశాఖ బీచ్)వద్ద నేచురల్ హిస్టరీ పార్కు రూ.88కోట్లతో బీచ్‌లో 15 మీటర్లు వెళ్లేలాగ నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను కేంద్రానికి పంపామన్నారు. ఓసెన్ డెక్ బీచ్ పార్కును కూడా రూ.7.80కోట్లతో షిప్ హోటల్‌ను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కైలాసగిరి కొండపై ప్లానిటోరియం విషయంలో ఇటీవలే కేంద్రం నుంచి సైన్స్ బృందం వచ్చి పరిశీలించి వెళ్లిందన్నారు. ఇక్కడ ప్రాజెక్టు సైన్సు సిటీ పేర రూ.5కోట్లతో ఎకరా స్థలంలో ఏపి ప్రభుత్వం సైన్సు సిటీ సంస్థతో అగ్రిమెంట్ చేసుకుంటుందని వివరించారు.

జివిఎంసి స్థాయీ సంఘం ఎన్నికల్లో వైసిపి విజయం

లక్ష్మీసౌజన్యకు 64 ఓట్లు పడ్డాయి. కోడిగుడ్ల పూర్ణిమకు 63, కంటిపాము కామేశ్వరికి 63, బల్ల లక్ష్మణరావుకు 63, భూపతి రాజు సుజాతకు 63 ఓట్లు పడగా, గుడ్ల విజయ సాయికి 62, బట్టు సూర్యకుమారికి 62, చల్లా రజనికి 61ఓట్లు చొప్పన పోలయ్యాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు జివిఎంసి ప్రధాన కార్యాలయంలో ఎన్నికను నిర్వహించారు. అనంతరం ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభించి సాయంత్రానికి గెలుపొందిన వివరాలను కమిషనర్ సాయికాంత్ వర్మ విడుదల చేశారు. ఈ ఓటింగ్‌లో జనసేన, సిపిఎం, సిపిఐ పాల్గొనలేదు. వైసిపి నుంచి కంపా హనోక్, మందపాటి సునీతలు విదేశాలకు వెళ్లడం వల్ల ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. కార్పొరేటర్ వంశీ ఎమ్మెల్సీ కావడం ఆ డివిజన్ ఖాళీగా ఉంది. అయితే అధికార పార్టీ నాయకులు తమకు అనుకూలమైన నిబంధనలు పెట్టుకుని ఎన్నిక జరిపించుకొని, వైసిపి అభ్యర్థులు గెలిచేలా చేశారని ప్రతిపక్షాలు, టిడిపి కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు.

అభివృద్ధిని చూసి గెలిపించారు : మేయర్

విశాఖలో ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి వైసిపికి చెందిన పది మంది కార్పొరేటర్లను స్టాండింగ్ కమిటీ సభ్యులుగా గెలిపించారని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. వైసిపి అభ్యర్థుల సంఖ్యా బలానికి మించి ఓట్లు పడ్డాయని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. టిడిపి కార్పొరేటర్లు కూడా ఓటేయడం బట్టి జగన్మోహన్‌రెడ్డి పాలనను ఆ పార్టీ కూడా ఆహ్వానిస్తున్నట్లేనని పేర్కొన్నారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ బలం లేకపోయినా పోటీకి దిగి అభాసుపాలవడం చంద్రబాబుకు అలవాటని వ్యాఖ్యానించారు.

చెత్త సేకరణ ఛార్జీల వసూలుపై ఒత్తిడి తగదు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ, ఎంవిపి.కాలనీ : చెత్త సేకరణ ఛార్జీల వసూలుకు సిబ్బందిపై ఒత్తిడి చేయడం సరికాదని వార్డా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.ప్రకాశరావు, బి.బి.గణేష్, నివాస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.గురప్ప, పిట్టా నారాయణమూర్తి పేర్కొన్నారు. సిబ్బందిపై ఈ విధంగా ఒత్తిడి చేయడం జివిఎంసి కౌన్సిల్ నిర్ణయాన్ని ఉల్లంఘించడమే అవుతుందన్నారు. రూ.120 వసూలు చేయాలని ఈ రోజు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, చెత్త పన్ను వసూలు లక్ష్యాలను చేరుకోవాలని, లక్ష్యాలు చేరుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని శానిటరీ సూపర్‌వైజర్లను బెదిరించడం అన్యాయం అన్నారు. ఒక పక్క చెత్త పన్ను తగ్గించిన జివిఎంసి కౌన్సిల్ నిర్ణయాన్ని బేఖాతర్ చేస్తూ, మరోపక్క హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండటాన్ని పట్టించుకోకపోవడం సరికాదని పేర్కొన్నారు. అధికారుల వేధింపులు తట్టుకోలేక శానిటరీ కార్యదర్శి ఒకరు కొన్ని నెలల క్రితం గుండెపోటుతో మరణించిన విషయాన్ని మర్చిపోకూడదన్నారు. కన్జర్వెన్సీ పన్ను రూపంలో చెత్త సేకరణ ఛార్జీలు ఆస్తి పన్నులో భాగంగా ఉన్నందున, అదనంగా చెత్త పన్ను వసూలు చేయకూడదని తెలిపారు.

యుఎంహెచ్ఇయు రాష్ట్ర అధ్యక్షునిగా జగన్మోహనరావు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులుగా కె.జగన్మోహనరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 16న విజయవాడలో జరిగిన రాష్ట్ర విస్తృత సమావేశంలో ఎన్నిక నిర్వహించారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న జగన్మోహనరావు రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నిక కావడం పట్ల జిల్లా కమిటీ హర్షం వ్యక్తం చేసింది. మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగుల సమస్యలపై మరింత కృషి చేయాలని జిల్లా కమిటీ అధ్యక్షులు చుక్కల సత్యనారాయణ కోరారు.

మహిళలకు రక్షణ లేదంటూ టిడిపి నిరసన

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : రాష్ట్రంలో మహిళలపై పెరిగిన దాడులు అరికట్టాలని, మహిళా ద్రోహి జగన్మోహన్‌రెడ్డి గద్దె దిగాలని, సైకో పాలన పోవాలని డిమాండ్ చేస్తూ టిడిపి ఆధ్వర్యాన బుధవారం పూర్ణా మార్కెట్ సమీపంలో ఉన్న దుర్గాలమ్మ గుడి వద్ద నిరసన తెలిపారు. సిఎం డౌన్ డౌన్ అంటూ తెలుగు మహిళా కార్యకర్తలు నినాదాలు చేశారు. సిఎం జగన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. జగన్మోహన్‌రెడ్డి చేతగాని పాలనలో మహిళలకు రక్షణ లేదని మహిళలు కరపత్రాలు పంచారు. వాటిని మంటల్లో దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి దక్షిణ ఇన్‌ఛార్జ్ గండి బాబ్జీ, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షులు సర్వసిద్ధి అనంతలక్ష్మి, కేదారి లక్ష్మి, వలిశెట్టి తాతాజీ, బుచ్చా రామిరెడ్డి, వాసుపల్లి రామ్‌కుమార్, గనగళ్ల సత్య, కోన చిన్న, సారిపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

25 కేసులను ఛేదించిన పోలీసులు

12 మంది అరెస్ట్, రూ.32 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : నగరంలోని పెందుర్తి, గాజువాక, ఎయిర్‌పోర్టు, నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన పలు కేసులకు సంబంధించిన నగర క్రైమ్ డిసిపి జి.నాగన్న బుధవారం మీడియాకు వివరించారు. 25 కేసులను ఛేదించి 12 మందిని అరెస్టుచేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి రూ.32 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార కేసుల విచారణ వేగవంతం

(మొదటిపేజీ తరువాయి...) చేయాలన్నారు. జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి కేసుల పరిష్కారానికి ప్రత్యేక విభాగం ఉందని, ఈ సెల్ ద్వారా కేసులు సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. జిల్లాలో డివిజనల్ స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశాలు ప్రతినెలా ఏర్పాటు చేయాలని, పెండింగ్ కేసులకు సంబంధించి బాధితులకు తమ కేసుల వివరాలను చెప్పుకునే అవకాశం ఇవ్వాలని సూచించారు. కేసులు పరిష్కారంపై తీసుకోవాల్సిన చర్యలను ఎప్పటికప్పుడు రెవెన్యూ అధికారులతో చర్చించాలని ఆదేశించారు.

కమిటీ సభ్యులు మాట్లాడుతూ సివిల్ రైట్స్ డే నిర్వహణ సక్రమంగా లేదని సరిగా నిర్వహించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డిడి కె.రామారావు, ఆర్‌డిఒలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్ రెడ్డి, డిసిపి నాగన్న , ఎసిపిలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ బివిఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సింజెంటా ఇండియా కొత్త ఆవిష్కరణ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : వరి, పత్తి, కూరగాయల రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రముఖ అగ్-టెక్ కంపెనీ సింజెంటా ఇండియా ఇన్సిపియో, సిమోడిస్‌ను బుధవారం బీచ్ రోడ్‌లోని అంబిక సి గ్రీన్ హోటల్‌లో ఆవిష్కరించింది. ఈ సందర్భంగా సింజెంటా ఇండియా కంట్రీ హెడ్, మేనేజింగ్ డైరెక్టర్ సుశీల్ కుమార్ మాట్లాడుతూ, ఈ అధునాతన ఉత్పత్తులు, వినూత్నమైన ప్లినజోలిన్ సాంకేతికత ఆధారంగా వివిధ తెగుళ్ల నుంచి పంటకు రక్షణను అందిస్తాయన్నారు. సింజెంటా ఇండియా మార్కెటింగ్ హెడ్ బిక్రమ్‌జీత్ సింగ్ మాట్లాడుతూ, వరిని ఆశించే కాండం తొలిచే పురుగులు, ఆకు ఫోల్డర్‌లను ఎదుర్కోవడంలో ఇన్సిపియో ముందుంటుందన్నారు. ఇన్సిపియో, సిమోడిస్ బహుళ కీటకాలపై సమర్థవంతంగా పనిచేస్తాయని చెప్పారు. సింజెంటా ఇండియా చీఫ్ సస్టైనబిలిటీ ఆఫీసర్ డాక్టర్ కెసి.రవి పాల్గొన్నారు.

20, 21తేదీల్లో జాబ్ మేళా

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : గ్రూవ్ స్నాప్ ఫెస్ట్ పేరుతో ఈ నెల 20, 21 తేదీల్లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నాలెడ్జి హట్ అప్ గ్రాడ్ ప్రతినిధి గౌతమ్ నందు, ఎడ్జ్ ఫ్లెక్స్ ప్రతినిధి వేదవ్యాస్‌రెడ్డి, వీ ఇన్ఫో టెక్నాలజీస్ సిఇఒ సాయి ప్రవల్లిక తెలిపారు. స్వర్ణభారతి స్టేడియంలో బుధవారం మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, వీ ఇన్ఫో టెక్నాలజీస్ ఆధ్వర్యాన ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఏజెన్సీ (ఏపిటా) జనరల్ మేనేజర్ వి.శ్రీధర్‌రెడ్డి సహకారంతో నిర్వహించే జాబ్ మేళాలో 40 పేరొందిన ఐటీ, ఫార్మా కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఇంటర్ ఆపైన చదివిన విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం ప్రాంతాల నిరుద్యోగులు హాజరు కావచ్చని పేర్కొన్నారు. వివరాలకు 9492885408, 9492885421ను సంప్రదించాలని సూచించారు.

చినుకుపడితే మురుగుతో చిక్కులు

- కాలువల్లోంచి రోడ్డెక్కి ప్రవహిస్తున్న డ్రైనేజీ నీరు
- అశాస్త్రీయ, నాసిరకపు నిర్మాణాలే కారణం
- మురుగు మళ్లింపునకు కానరాని చర్యలు
- అవస్థలు పడుతున్న ప్రజలు, పట్టని అధికారులు

ప్రజాశక్తి -తగరపువలస : హైవే విస్తరణ పనుల్లో శాస్త్రీయత లేకపోవడం, నిర్మాణంలో నాణ్యతాలోపం ఇపుడు ప్రజలు, వాహనదారులకు శాపంలా మారుతోంది. చిన్నపాటి వర్షం కురిసినా,కాలువల్లోకి వెళ్లాల్సిన మురుగునీరు, అటునుంచి ఇటు రోడ్డెక్కి ఉధృతంగా ప్రవహిస్తూ ప్రజలు, వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. జాతీయరహదారిని ఆనుకుని ఉన్న సబ్బివీధిలో వర్షం కురిసిందంటే చాలు మురుగునీరంతా రోడ్డుపైకెక్కి ఆ ప్రాంతం పూర్తిగా జలమయమౌతుంది. తగరపువలస మెయిన్ రోడ్డు నుంచి సంగివలస వైపు, అవతల చిట్టివలస విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి జీడి పప్పు దుకాణాల వరకు ఇదే సమస్య .రోడ్డు పక్కన గుడారాల్లో నివసిస్తున్న వారుసైతం బయటకు రాలేని పరిస్థితి.


పైకప్పు సిమెంట్ పలకలు లేని డ్రైనేజీ

ఇది ఇప్పటికిప్పుడే ఏర్పడిన సమస్య కాదు. జాతీయ రహదారి విస్తరణ పనులు పూర్తయిన నాటి నుంచి ఇదే పరిస్థితి. కాలువల నిర్మాణాల్లో శాస్త్రీయత లేకపోవడం, కాలువలపై వేసిన సిమెంట్ పలకలు నాసిరకంగా ఉండడం ప్రస్తుత పరిస్థితికి కారణమని కాసింత పరిజ్ఞానం ఉన్న ఎవరికైనా ఇట్టే అర్థమౌతుంది. సబ్బివీధిలోనే కాకుండా ఆవల చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ మొదలు జీడిపప్పుల దుకాణాల వరకు ఇదే సమస్య.వర్షం కురిస్తే ఆయా చోట్ల వర్షపు నీరు, మురుగుకాలువల్లోని నీరు రోడ్డెక్కి పొంగి ప్రవహిస్తోంది.

తలనొప్పిగా మురుగు నీటి సమస్య..

జాతీయరహదారి విస్తరణలో రోడ్డుకు అనుకుని ఇరువైపులా కాలువల నిర్మాణం, వాటిపై వేసిన సిమెంట్ పలకల నాణ్యతాలోపం, ముందుచూపు లేకుండా చేపట్టిన


సబ్బివీధిలో డ్రైనేజీలోంచి రోడ్డుపైకి వస్తున్న మురుగునీరు

పనులు వల్ల తలెత్తిన మురుగునీటి కష్టాలు ఇటు ప్రజలతోపాటు అటు జివిఎంసి యంత్రాంగానికి తలనొప్పిగా మారింది.హైవే అధికారుల్లో కొందరి అనాలోచిత నిర్ణయాలకు ఇపుడు జనం ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిసిన ప్రతి సందర్భంలోనూ నీటి మళ్లింపునకు ఒకటో జోన్ జివిఎంసి అధికారులతోపాటు పారిశుధ్య యంత్రాంగం, కార్మికులు శ్రమించాల్సి వస్తోంది. పెరుగుతున్న పట్టణ జనాభా, వారి అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టి ఉంటే ఈ తరహా కొత్త సమస్యలు ఉత్పన్నం కావని స్థానికులు అంటున్నారు.ఈ సమస్యకు శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టేవరకు ప్రజలకు, అధికారులకు అవస్థలు తప్పవని పలువురు అంటున్నారు.

డ్రైనేజీలపై ఆక్రమణలు తొలగించాలి

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక మెయిన్ రోడ్డుకు ఇరువైపులా జివిఎంసి నిర్మించిన మురుగుకాలువలపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని టిడిపి విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ కార్యదర్శి పిట్టా సురేష్ డిమాండ్ చేశారు. డ్రైనేజీలను ఆక్రమించుకుని కొన్నిచోట్ల తాత్కాలికంగా, ఇంకొన్ని చోట్ల శాశ్వతంగా నిర్మాణాలు చేపట్టారని, దీంతో వర్షం కురిసే సమయంలో మురుగునీరు మళ్లిపోయే వీలులేక, వర్షపు నీటితో కలిసి రోడ్డుపై ప్రవహిస్తోం దన్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ప్రజలు, వాహన దారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రన్నారు. కొందరు దుకాణదారులు చెత్తనుబుట్టలో వేస్తున్నారా? లేదా కాలువల్లో వేస్తున్నారా? పట్టించుకునే దిక్కులేదన్నారు. దుకాణదారుల నుంచి చెత్త పన్నును ముక్కు పిండి వసూలు చేస్తున్న జివిఎంసి యంత్రాంగం, చెత్తసేకరణ, డ్రైనేజీల నిర్వహణలో చిత్తశుద్ధి కనబరచడం లేదని ఆరోపించారు.

నేడు రాజకీయ నేతలతో సమావేశం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో ఈ నెల 20న ఉదయం 10 గంటలకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, స్థానిక ఆర్‌డిఒ ఎస్ భాస్కరరెడ్డి బుధ వారం ఒక ప్రకటనలో తెలిపారు.

క్రమశిక్షణతో చదువుకుంటే ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి- మధురవాడ :విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉజ్వల భవిష్యత్‌కు బంగారుబాటలు వేసుకోవాలని రిటైర్డు ప్రిన్సిపల్ అయ్యగారి మార్తాండం అన్నారు. బుధవారం జివిఎంసి ఏడవ వార్డు సునీల్ శర్మ కాలనీలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు చాలా అభివృద్ధి చెందాయని, ప్రభుత్వ విద్యాపథకాలను చక్కగా సద్వినియోగం చేసుకుని మంచి పౌరులుగా ఎదగాలని, ఉన్నతస్థాయిలో స్థిరపడేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. టెన్త్‌లో అత్యుత్తమ మార్కులతో శతశాతం ఉత్తీర్ణత సాధించి, పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మార్తాండంను సత్కరించారు. శాండిల్య, నీరజ, పాల్గొన్నారు.


మార్తాండం మాస్టారును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు


కార్పొరేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

తాగునీటి సమస్య పరిష్కారానికి వినతి

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 95వ వార్డు మరిడిమాంబ కాలనీ దరి పురుషోత్తం హౌసింగ్ బోర్డ్ కాలనీలో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని ఆ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గున్నమ్మ, కార్యదర్శి సూర్యప్రకాష్, జాయింట్ సెక్రెటరీ పద్మ, వైస్ ప్రెసిడెంట్ వనజ, ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు గీత కోరారు. బుధవారం స్థానిక కార్పొరేటర్ ముమ్మన దేముడును కలిసి వినతిపత్రం అందజేశారు. నేటికీ జివిఎంసిలో విలీనం కాకపోవడం వల్లే తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేటర్ దేముడు స్పందిస్తూ, వెంటనే సంబంధిత అధికారులతో ఫోనులో మాట్లాడి, సమస్యను వివరించి, పరిష్కరించాలని కోరారు.

శతశాతం సంక్షేమం 'సురక్ష' లక్ష్యం


సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఆడారి ఆనందకుమార్

ప్రజాశక్తి-సీతమ్మధార : అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ లబ్ధి చేకూర్చి తద్వారా శతశాతం ప్రజలకు మేలు చేయాలన్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంకల్పమని, అందుకే జగనన్న సురక్ష శిబిరాలను నిర్వహిస్తున్నామని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర చైర్మన్ కెకె రాజు అన్నారు. బుధవారం 49వ వార్డు ఎన్‌ఎస్‌ఆర్ నగర్ సచివాలయం వద్ద జగనన్న సురక్ష శిబిరంలో పాల్గొని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, స్థానిక కార్పొరేటర్ అల్లు శంకరరావు, 48వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి నీలి రవి, జివిఎంసి జోనల్ కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, తహశీల్దార్ జయ, ఎపిడి పద్మావతి, ఎఇఅర్చన, డైరెక్టర్లు ఎన్.రవికుమార్, అధికారులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ములగాడ :జివిఎంసి 40వ వార్డు ఎకెసి కాలనీ, 63వ వార్డులో నిర్వహించిన జగనన్న సురక్షలో వైసిపి పశ్చిమ నియోజకవర్గం కన్వీనర్ ఆడారి ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు. సిఎం జగన్ విధానాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టిన ఏడాదిలోనే నియోజకవర్గాన్ని ఆనందకుమార్ ఎంతో అభివృద్ధి చేశారని, ఎమ్మెల్యేగా గెలిపిస్తే పశ్చిమను ఆదర్శంగా తీర్చిదిద్దడం ఖాయమన్నారు. తన సొంత నిధులతో పింఛను అందిస్తున్న ఆనందకుమార్‌కు నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఎకెసి కాలనీలో నాలుగు దశాబ్దాలుగా ఉన్న 437 రేకుల ఇళ్ల సమస్యకు ఆనందకుమార్ చొరవతో పరిష్కారం లభించనుందని, జీప్లస్3 ఇళ్ల నిర్మాణానికి సిఎం జగన్ ఆమోదించిన నేపథ్యంలో త్వరలో శంకుస్థాపనలు చేస్తారన్నారు.కార్యక్రమంలో కలిదిండి బద్రీనాథ్, బోగవల్లి నాగభూషణం,, తహశీల్దార్ వీరభద్రరావు సోమాదుల సురేష్, వరపల మహేష్, నమ్మి శ్రీను పాల్గొన్నారు.

ఆరిలోవ : 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం ఆరిలోవ కాలనీ, చివరి బస్టాపు వద్ద జగనన్న సురక్ష శిబిరంలో వైసిపి తూర్పు సమన్వయకర్త, విఎంఆర్‌డిఎ చైర్మన్ అక్కరమాని విజయనిర్మల పాల్గొని పలువురు లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. జెడ్‌సి కనక మహాలక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జివిఎంసి అధికారులు,వైసిపి నేతలు పాల్గొన్నారు.

కొందరికే, కొన్ని ధ్రువీకరణలే జారీ

జగనన్న సురక్ష శిబిరంలో 11రకాల సర్టిఫికెట్లు ఇస్తారని ప్రజలు ఆశిస్తే, కొందరికి కొన్ని సర్టిఫికెట్లను మాత్రమే ఇస్తున్నారని, వార్డు వైసిపి నేత కెల్ల సత్యనారాయణ అధికారుల దృష్టికితెచ్చారు. కుల ధ్రువీకరణలను నానా కొర్రీలు పెడుతున్నారని వివరించారు. దీనిపై జెడ్‌సి కనకమహాలక్ష్మీ స్పందించి, సంబంధిత సచివాలయ అడ్మిన్‌లను పిలిపించి తగు సూచనలు చేశారు.

ఆనందపురం: మండలంలోని రామవరం, శొంఠ్యాం గ్రామపంచాయతీల్లో జగనన్న సురక్షలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు. రామవరంలో విలేజ్ క్లినిక్, సచివాలయాన్ని శొంఠ్యాంలో పిహెచ్‌సిని ప్రారంభించారు 412మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేశారు. తహశీల్దార్ లోకవరపు రామారావు, ఎంపిడిఒ అడప లవరాజు, వైసిపి మండల అధ్యక్షులు బంక సత్యం, వైస్ ఎంపిపి పాండ్రంకి శ్రీను, ఉపాధ్యక్షులు కోరాడ ముసలినాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, కాకర్లపూడి శ్రీకాంత్, లంక రాంబాబు, రౌతు శ్రీను, సర్పంచ్ లంక రాంబాబు, ఎంపిటిసి గొలగాని కృష్ణ, పల్లదుర్గ, కోరడ రమణారావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆర్థిక ఇబ్బందులతో దంపతుల ఆత్మహత్య


మృతులు ఎంవికె ప్రసాద్, రాజరాజేశ్వరి దంపతులు

ప్రజాశక్తి -మధురవాడ :ఆర్థిక ఇబ్బందులు తాళలేక భార్యాభర్తలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పిఎం పాలెం సిఐ వై రామకృష్ణ వెల్లడించిన సమాచారంతో పాటు సేకరించిన వివరాలివి. జివిఎంసి ఐదో వార్డు కొమ్మాది శివశక్తినగర్ రోడ్డు అయ్యప్ప నగర్‌లో ప్రైవేటు అపార్టుమెంట్‌లో నివాసముంటున్న ఎంవికె.ప్రసాద్ (54), అతని భార్య రాజరాజేశ్వరి (50) తమ ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరు స్థానికంగా ఆర్‌ఓ ప్లాంట్ నిర్వహిస్తున్నారు. స్మార్ట్ విలేజ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా శ్రీకాకుళం జిల్లా కవిటి కేంద్రంగా ఉన్న సంస్థలో వీళ్లిద్దరూ ప్రతినిధులుగా పనిచేస్తున్నారు. వివిధ సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని, ముందుగా శిక్షణ, ఆపై నియామకాలు ఉంటాయని సంస్థ తరపున ప్రచారం చేశారు. విశాఖ ప్రాంతానికి ప్రతినిధులుగా ఉన్న వీరిని నమ్మి పలువురు నిరుద్యోగులు ఒక్కొక్కరు రూ.20వేల నుంచి రూ.25వేల వరకు ఆ సంస్థకు డిపాజిట్ చేశారు. రోజులు గడుస్తున్నా ఉద్యోగాలు ఇవ్వకపోగా, కట్టిన డిపాజిట్లు చెల్లించలేదు. దీంతో బాధిత నిరుద్యోగులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ పరువు పోయిందనే మనస్తాపంతో వారు బలవన్మరణానికి పాల్పడి ఉంటారని అనుమానిస్తు న్నారు. పిఎం పాలెం సిఐ రామకృష్ణ ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. దంపతుల మృతదేహాలను పోస్టు మార్టానికి కెజిహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - యలమంచిలి : మండలంలోని కొక్కిరాపల్లి సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో రొయ్యల లోడ్‌తో వెళ్తున్న కంటైనర్ డ్రైవర్ మృతి చెందారు. రూరల్ ఎస్ఐ సన్నిబాబు కథనం ప్రకారం... పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం నుంచి విశాఖకు రొయ్యల లోడ్‌తో వెళుతున్న కంటైనర్, బుధవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో కొక్కిరాపల్లి సమీపంలో ఎదురు ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కంటైనర్ డ్రైవర్ బి.లక్ష్మీ నారాయణ అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని గొర్రిపాలెం గ్రామ శివారులో మంగళవారం రాత్రి పేకాట శిబిరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని నగదు స్వాధీనం చేసుకున్నట్లు బుచ్చయ్యపేట ఎస్సై కుమార్ స్వామి బుధవారం తెలిపారు. చోడవరం మండలానికి చెందిన వాలిమరక నాగరాజు, బర్ల ఫణి కుమార్, సబ్బవరంనకు చెందిన రెడ్డి ఈశ్వరరావు, రావికమతం మండలం గొంప గ్రామానికి చెందిన మనభర్తి మాలిబాబు, బుచ్చయ్యపేట మండలం తైపురం గ్రామానికి చెందిన పులుగ అప్పారావు, ఎఅర్జునను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుండి రూ.15,082 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సమగ్ర ఓటర్ల జాబితా తయారీకి సహకరించండి

ప్రజాశక్తి-పెందుర్తి : సమగ్రమైన ఓటర్ల జాబితా తయారీకి రాజకీయపార్టీల నేతలు సహకరించాలని ఆర్‌డిఒ హుస్సేన్ అన్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 21నుంచి ఓటర్ల జాబితా పరిశీలన జరగనున్న నేపథ్యంలో సర్వే బృందానికి బూత్ స్థాయిలో సహకారం అందించాలని, తద్వారా కచ్చితమైన ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించడానికి వీలుంటుందన్నారు. జాబితాలోని ఓటర్లను నిర్ధారించడంతోపాటు తొలగింపులు, చేర్పులుమార్పులకు సూచనలు చేయాలన్నారు.ఈ సందర్భంగా నేతల సందేహాలను ఆర్‌డిఒ నివృత్తి చేశారు.కార్యక్రమంలో వైసిపి ప్రతినిధి నక్క కనకరాజు, టిడిపి నేత కరక దేవుడు జనసేన నాయకులు సేనాపతి శేఖర్, శ్రీకాంత్, కాంగ్రెస్ నేతలు షఫీ, రమేష్ నాయుడు సిపిఐ నాయకుడు ఆర్. శ్రీనివాసరావు పాల్గొన్నారు

నిర్వాసిత కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

అదానీ గంగవరం పోర్టు కార్మికుల దీక్షలకు టిడిపి సంఘీభావం



నిరసన దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి బండారు

ప్రజాశక్తి -గాజువాక : అదాని గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం వీడి తక్షణమే పరిష్కరించాలని టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి , మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. గంగవరంపోర్టు కార్మికుల నిరవధిక దీక్షలు 16వ రోజుకు చేరిన సందర్భంగా బుధవారం దీక్ష శిబిరాన్ని సందర్శించి ఉద్యమానికి సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంగవరం పోర్టు నిర్మాణానికి తమ ఆస్తులను త్యాగం చేసిన నిర్వాసిత కార్మికులకు న్యాయమైన వేతనాల చెల్లింపులో యాజమాన్యం మొండివైఖరి వీడాలని డిమాండ్ చేశారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే బాధ్యత తీసుకొని, అఖిలపక్షాలను, యాజమాన్యాన్ని కలెక్టర్ వద్దకు తీసుకెళ్లి, సంప్రదింపులతో నిర్వాసిత కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్మికులకు న్యాయం కోసం తాము ఎప్పుడు, ఎక్కడికి రమ్మన్నా వచ్చేందుకు సిద్ధమని స్పష్టం చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి బి జగన్ మాట్లాడుతూ అదానీ గంగవరం పోర్టు కార్మికుల పోరాటానికి రాష్ట్రవ్యాప్తంగా సంఘీభావాన్ని సిఐటియు కూడగడుతోందన్నారు. విశాఖపట్నం పోర్టులో కార్మికులకు ఇస్తున్నట్లు గంగవరం పోర్టు కార్మికులకు రూ.36,400 కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. విధుల నుంచి తొలగించిన కార్మికులను వెంటనే ఉద్యోగం లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య మాట్లాడుతూ యాజమాన్యానికి అదానీ గంగవరం పోర్టుకు వస్తున్న లాభాల్లో వాటాలను నిర్వాసిత కార్మికులు అడగడం లేదని, న్యాయమైన కనీస వేతనం చెల్లించాలని కోరుతుంటే ఎందుకు మొండిగా వ్యవహరిస్తోందని ప్రశ్నించారు. దీక్షల్లో యూనియన్ ప్రధాన కార్యదర్శి లొల్లి తాతారావు, సిఐటియు స్టీల్‌జోన్ ప్రధాన కార్యదర్శి కొవిరి అప్పలరాజు, వాసుపల్లి ఎల్లాజీ, గంటిపిల్లి అమ్మోరు, మాద అప్పారావు, పేర్ల నూకరాజు, కదిరి సత్యానందం, నొల్లి స్వామి, గంటిపిల్లి లక్ష్మయ్య, కొవిరి అమ్మోరు పాల్గొన్నారు

వేజ్ బోర్డు ఏర్పాటుచేయాలి

కలెక్టరేట్: గంగవరం పోర్టు జిపిఎల్, జిపిఎస్ కార్మికులకు వేజ్ బోర్డు ఏర్పాటుచేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు డిమాండ్ చేశారు. గంగవరం పోర్టు కార్మికుల నిరవధిక నిరసన దీక్షకు మద్దతుగా బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సిపిఐ ఆధ్వర్యాన సంఘీభావ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గంగవరం పోర్టు కార్మికులకు కనీస వేతనం రూ.36 వేలు ఇవ్వాలని, కనీస సౌకర్యాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని, తొలగించిన కార్మికులను బేషరతుగా విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్‌కె రెహమాన్, ఎ.విమల తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల సంఘం మద్దతు

గాజువాక : అదానీ గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికుల దీక్షలకు నిర్వాసితుల సంఘం నేతలు సంఘీభావం తెలిపారు. బుధవారం దీక్షా శిబిరాన్ని సందర్శించి, మద్దతు ప్రకటించిఇన నిర్వాసిత సంఘం నాయకులు పులి రమణారెడ్డి మాట్లాడుతూ, కార్మికుల న్యాయమైన కోర్కెలైన కనీస వేతనం రూ.36వేలు అమలు, వైద్యసదుపాయం, తొలగించిన 29మంది కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవడం చేయాలన్నారు. కార్యక్రమంలో వై శీను, మంత్రి గోపి, కణితి అప్పలరాజు, దొమ్మేటి అప్పారావు, ములగల పిల్లి పెంటయ్య, బాలకృష్ణ, తాతారా, బస అప్పలరెడ్డి, ఎల్లాజీ పాల్గొన్నారు.

డ్రాపౌట్స్‌ను బడిలో చేర్పించాలి



విద్యార్థులు, తల్లిదండ్రులకు కిట్లు అందిస్తున్న డిఇఒ చంద్రకళ

ప్రజాశక్తి -ఆనందపురం: అర్థాంతరంగా చదువు మానివేసిన విద్యార్థులను గుర్తించి బడిలో చేర్పించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని డిఇఒ ఎల్.చంద్రకళ కోరారు. బుధవారం ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు .అనంతరం డ్రాపౌట్స్‌గా గుర్తించిన పది మంది విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ఆనందపురం 24 కాలనీ ,బుడగ జంగాల కాలనీ, పొడుగుపాలెం గ్రామాలను వెళ్లి, డ్రాపౌట్ పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేశారు. పిల్లలు చదువుకునేందుకు ప్రభుత్వం ఎన్నో విద్యా, సంక్షేమ పథకాలను అందిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని పిల్లల భవిష్యత్‌కు బంగారుబాట వేయాలని సూచించారు. డ్రాపౌట్ విద్యార్థులకు స్కూలు యూనిఫామ్, పుస్తకాలు అందించి మరల పాఠశాలలో చేరే విధంగా ప్రోత్సహించారు. బడిమానేసిన పిల్లలను తిరిగి చదువుకునేలా వారి తల్లిదండ్రులకు ఒప్పించాలని పొడుగుపాలెం ఎంపిటిసి బంటుబిల్లి అప్పలస్వామికి సూచించారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు

డంపింగ్ యార్డు తరలించాలి

ప్రజాశక్తి - ఆరిలోవ :జనావాసాలకు, నగరవాసులకు తాగునీటిని సరఫరా చేసే ముడసర్లోవ రిజర్వాయర్‌కి సమీపంలో ఉన్న జివిఎంసి డంపింగ్ యార్డును వెంటనే తరలించాలని ఎఐవైఎఫ్ డిమాండ్ చేసింది. బుధవారం జిల్లా ఎఐవైఎఫ్ జిల్లా బృందం ముడసర్లోవ రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డును, ముడసర్లోవ రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అచ్యుతరావు, వై.రాంబాబు మాట్లాడుతూ డంపింగ్ యార్డు దగ్గరలో ఒడడంతో జలాశయంలోని నీరు కలుషితమౌతోందని ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు దుర్గంధంతో రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం, ఆరిలోవ కాలనీ ప్రజలతో పాటు బిఆర్‌టిఎస్ రోడ్డులో ప్రయాణించే వారంతా ఇబ్బందు లకు గురౌతున్నారనారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తక్షణమే డంపింగ్ యార్డు తరలించాలని డిమాండ్ చేశారు. ఎన్.మధురెడ్డి, కొమర సందీప్, అశోక్ పాల్గొన్నారు.

ఎంవిఆర్ కాలేజీలో యోగా కోర్సులు

ఆంధ్రా యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న రెండు సంస్థల ప్రతినిధులు

ప్రజాశక్తి-గాజువాక : డిప్లమా, పిజి డిప్లమో ఇన్ యోగా కోర్సుల నిర్వహణకు గాజువాకకు చెందిన ఎంవిఆర్ డిగ్రీ కళాశాల ఆంధ్రవిశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం చేసుకుంది. బుధవారం ఎయు విసి ఆచార్య పివిజివి ప్రసాదరెడ్డి సమక్షంలో ఎయు రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఎంవిఆర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ వి.రామారావు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఎయు విసి ప్రసాద రెడ్డి మాట్లాడుతూ యోగా కోర్సుల నిర్వహణకు ఎంవీఆర్ కళాశాల ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఎంవిఆర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ వి.రామారావు మాట్లాడుతూ, ఎయు నిర్వహించే యోగా కోర్సులను తమ కాలేజీని ఎంపిక చేయడంపై హర్షం వ్యక్తం చేశారు.ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే కోర్సు ప్రారంభమౌతాయన్నారు. ఎయు రెక్టార్ ఆచార్య కె.సమత, అకడమిక్ డీన్ ఎన్.కిశోర్‌బాబు, యోగా విభాగాధిపతి ఆచార్య కె.రమేష్‌బాబు, ఎంవీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ ఎస్‌వి.కృష్ణ పాల్గొన్నారు.

బాధితులకు ఇళ్లు కేటాయించాలని ధర్నా



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బాధిత రైతులు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి కొమ్మాది, బక్కన్నపాలెం, రేవళ్లపాలెం గ్రామాల్లో భూములు కోల్పోయిన పేద రైతులకు తక్షణమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో చినగదిలి తహశీల్దారు కార్యాలయం వద్ద బాధితులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ఇందిరాగాంధీ ప్రభుత్వ హయాంలో 88 మందికి ఒక్కొక్కరికి ఎకరం చొప్పున వ్యవసాయ భూమి కేటాయిస్తూ పట్టాలు ఇచ్చారని, ఆ భూములను సాగుచేసుకుంటూ జీవించేవారన్నారు. తరువాత ప్రభుత్వ అవసరాల పేరుతో రైతులకు చెప్పకుండానే వారి నుంచి నవోదయ స్కూలు, పోలీస్ ట్రెనింగ్ కేంద్రం, వికలాంగుల ఐటిఐ, పట్టుపురుగుల అభివృద్ధి కేంద్రం ఏర్పాటుకు భూములు లాక్కున్నారన్నారు. తరువాత జూనియర్ కాలేజీ నిర్మాణం కోసం భూములు సేకరిస్తుండగా రైతులు, గ్రామస్తులందరూ అడ్డుకున్నారన్నారు. తీసుకున్న భూములకు ప్రత్యామ్నాయం చూపాలని ఆందోళన చేసిన నేపథ్యంలో హుదూద్ బాధితులకు సినిమా అసోసియేషన్ నిర్మిస్తున్న ఇళ్లను నిర్వాసితులకు కేటాయిస్తామని హామీ ఇచ్చారని, అది నేటికీ కార్యరూపం దాల్చలేదన్నారు.దీనిపై జిల్లా కలెక్టర్, హౌసింగ్ పిడి, ఆర్‌డిఒలకు అనేకసార్లు విన్నవించగా, రెవెన్యూ అధికారులు విచారణ జరిపి, అర్హుల జాబితా సిద్ధం చేసినా నేటికీ కేటాయింపులు చేపట్టలేదన్నారు. అనంతరం తహశీల్దారు రమణయ్యకు వినతి పత్రం అందజేసారు. కార్యక్రమంలో సిపిఎం మధురవాడ జోన్ కన్వీనర్ డి.అప్పలరాజు పాల్గొన్నారు.

23న ఆర్‌పి పట్నాయక్‌తో ముఖాముఖి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైజాగ్ ఫిల్మ్‌సొసైటీ ప్రతినిధులు

ప్రజాశక్తి -సీతమ్మధార : ప్రముఖ సినీ సంగీత దర్శకుడు, నటుడు, నిర్మాత, చిత్ర దర్శకుడు ఆర్‌పి. పట్నాయక్‌తో ఈ నెల 23న ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు 'కరోనా తరువాత ప్రపంచ సినిమా పరిస్థితి' అంశంపై ప్రసంగం, ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు తెలిపారు. విశాఖ పౌరగ్రంథాలయంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను బుధవారం ఎల్‌బి కాలేజ్ ప్రాంగణంలోని గాంధీ సెంటర్‌లో ఆవిష్కరించారు ఈ సందర్భంగా వైజాగ్ ఫిలిం సొసైటీ నగర కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ కోవిడ్ తరువాత సినీరంగంలో చోటుచేసుకున్న విభిన్న పరిణామాలపై ఆర్‌పి పట్నాయక్ మాట్లాడతారని, ప్రేక్షకుల సందేహాలను నేరుగా సమాధానమిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి ప్రవేశం ఉచితమేనని, సినీప్రియులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సొసైటీ అధ్యక్షులు ఆచార్య ఎస్‌ఎడి పాల్, బి.చిన్నారావు, డాక్టర్ బాబ్జీ, డాక్టర్ అర్చన, డాక్టర్ గాయత్రి, కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

రాష్ట్రమంత్రి గుడివాడ అమర్‌నాథ్



మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి-పెందుర్తి : అంధులకు కంటిచూపుతోపాటు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న శంకర ఫౌండేషన్ సేవలు అభినందనీయమని రాష్ట్రమంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. బుధవారం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రిలో ఆత్మకూరి యశోద సెంటర్ ఫర్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్‌ను మంత్రి అమర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటివరకు ఐదు లక్షల కంటి ఆపరేషన్లు నిర్వహించి, అంధులకు చూపు ప్రసాదించిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సేవలు అజరామరమన్నారు. సెల్‌ఫోన్ పుణ్యమాని కంటి సమస్యలు వస్తున్నాయని, అందుకే పాఠశాలల్లో పిల్లలకు కంటిపరీక్షల నిర్వహణకు వైఎస్‌ఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, అందులోనూ శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి భాగస్వామ్యం కావడం ప్రశంసనీయమన్నారు. వైఎస్‌ఆర్ ముఖ్యమంత్రిగా శంకర ఫౌండేషన్‌కు ప్రభుత్వభూమిని కేటాయించారన్నారు. మారుతున్న కంటి ఆరోగ్య సమస్యల పరిశోధనలకు అనుగుణంగా శంకర్ ఫౌండేషన్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అదీప్‌రాజ్, శంకర్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ కృష్ణకుమార్, జనరల్ మేనేజర్ రాధాకృష్ణన్, డాక్టర్ రవీంద్ర, డాక్టర్ అజయ్‌శర్మ, డాక్టర్ నసీన్, డాక్టర్ శిరీష, డాక్టర్ కృష్ణ ప్రసాద్, డిజిఎం పిఆర్ బంగారురాజు, డిజిఎం పేషెంట్ కేర్ రమేష్‌కుమార్, ఎజిఎం వేణుగోపాల్ పాల్గొన్నారు

అభివృద్ధి పనుల సమాచారం ఇవ్వండి

ప్రజాశక్తి -ఆనందపురం : వైసిపి హయాంలో భీమిలి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనుల సమాచారం ఇవ్వాలని కోరుతూ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కోరాడ రాజుబాబు ఆధ్వర్యంలో ఆపార్టీ నేతలు పలు కార్యాలయాల్లో సమాచారహక్కు చట్టం కింద దరఖాస్తులు చేశారు. అభివృద్ధి చేశామని గొప్పలు చెబుతున్న వైసిపి బండారాన్ని బయటపెట్టి, ప్రజలకు తెలియజేసేందుకు సమాచార హక్కు చట్టం కింద వివరాలను కోరినట్లు వెల్లడించారు. తహశీల్దార్ ఎల్.రామారావు, ఎంపిడిఒ, వ్యవసాయశాఖ ఇతర కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకున్నారు. విశాఖ పార్లమెంటరీ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ మీసాల సత్యనారాయణ, అంగటి రాము, తాట్రాజ్ అప్పారావు, కొటియాడ రెడ్డిబాబు, గుండు చిన్నబాబు, ఎంపిటిసి బంటుపల్లి అప్పలస్వామి, మరుపిల్లి ప్రసాద్, మరుపిల్లి సాయిజ్ఞానేశ్వర్, ముత్యాలు పాల్గొన్నారు.

అణుకు గ్రామానికి రహదారి, పాఠశాల సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి

కోటవురట్ల మండలం గొట్టివాడ పంచాయితీ శివారు అణుకు గిరిజన పిటిజి గ్రామానికి రహదారి, పాఠశాల సౌకర్యాలు కల్పించాలని సిపిఎం నాయకులు బుధవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ 52 కుటుంబాల పిటిజి తెగకు చెందిన గిరిజనులు అణుకులో వ్యవసాయం చేసుకొని జీవిస్తున్నారని, గొట్టివాడ రోడ్‌కు 6 కిలోమీటర్ల దూరంలో ఈ గ్రామం ఉందని, కనీసం నడిచి వెళ్లేందుకు రహదారి కూడా సక్రమంగా లేదని తెలిపారు. ఆరోగ్యం బాగోలేకపోయినా, గర్భిణులను ఆస్పత్రికి తీసుకెళ్లాలన్నా దుప్పటి కట్టి (డోలి) మోసుకొని తీసుకెళ్తున్నారని, సమయానికి వైద్యం అందక మధ్యలో కాన్పులు జరిగి, పిల్లలు చనిపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లులను ఆస్పత్రికి తీసుకు రాలేక అనారోగ్యం, రక్తహీనతతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. గొట్టివాడ రోడ్ నుంచి అణుకుకు బిటి రోడ్/ సిమెంట్ రోడ్ వేయాలని, గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలని, మినీ అంగన్వాడీ సెంటర్‌ను మెయిన్ అంగన్వాడీ కేంద్రంగా మార్చాలని, ఆశా కార్యకర్తను నియమించాలని, సోలార్ ప్యానల్ మరమ్మతు చేయించి సరిపడా తాగునీరు సరఫరా చేయాలని, గిరిజన కుటుంబాలకు అంత్యోదయ అన్నయోజన కార్డులు మంజూరు చేయాలని, రేషన్ సరుకులు అణుకులో ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇళ్లులేని, ఇళ్లుపాడైన గిరిజనులందరికీ జగనన్న హౌసింగ్ స్కీం కింద ఇంటి స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని, సాగు చేస్తున్న భూమికి ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు ఇవ్వాలని కోరారు.



నిరసన తెలుపుతున్న యూనియన్ బ్యాంకు ఉద్యోగులు

బ్యాంకుల ప్రైవేటీకరణపై ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి- అనకాపల్లి

ప్రభుత్వ బ్యాంకులను ప్రైవేటీకరణ చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ యూనియన్ బ్యాంక్ తుమ్మపాల శాఖ కార్యాలయం వద్ద బుధవారం బ్యాంకు ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ ఉద్యోగుల సంఘం నాయకుడు కాండ్రేగుల హరికృష్ణ మాట్లాడుతూ బ్యాంకులను జాతీయకరణ చేసి 55 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో బ్యాంకు ఉద్యోగులు పండుగ చేసుకుంటున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం జాతీయ బ్యాంకులను ప్రైవేటుకరణ చేస్తానడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు శరగడం శ్రీనివాస్, గిరిధర్, పవన్, సందీప్, రాజు, హరిక, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

బొజ్జన్న కొండ అభివృద్ధిపై హర్షం

ప్రజాశక్తి-అనకాపల్లి : బొజ్జన్న కొండ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.7.33 కోట్లు విడుదల చేయడంపై సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. పనులు వేగవంతం చేయాలని కోరుతూ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బల్ల నాగభూషణం బుధవారం ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతిని కలిసి వినతిపత్రం అందజేశారు. బొజ్జన్న కొండ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.8 కోట్లు విడుదల చేసిందని, దీంతో ఈ బొజ్జన్న కొండ ప్రముఖ పర్యాటక కేంద్రంగా మారనుందని నాగభూషణం తెలిపారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 23వ తేదీన తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండల రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కోనపల్లి రామ్మోహన్ రావు పిలుపునిచ్చారు. స్థానిక సహకార సంఘం ఫంక్షన్ హాల్ లో బుధవారం మునగపాక,అచ్యుతాపురం మండలాల రేషన్ డీలర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామ్ మోహన్ రావు మాట్లాడుతూ ఏపీ రాష్ట్ర రేషన్ డీలర్ల అసోసియేషన్ పిలుపులో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో రేషన్ డీలర్లు హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో అచ్యుతాపురం సంఘం అధ్యక్షులు రాజానశంకర్, రెండు మండలాల డీలర్లు పాల్గొన్నారు.

సమస్యలపై ఎండిఎం కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి-చోడవరం

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన బుధవారం స్థానిక ఎంఈఓ కార్యాలయం ముందు కార్మికులు ఆందోళన చేపట్టారు. అనంతరం ఎంఈఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.వరలక్ష్మి మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. వివిధ సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నామన్న ప్రభుత్వం మోసం చేసిందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం కల్పించడానికి మెనూ ఛార్జీలు పెంచాలని, కార్మికులకు ఇవ్వవలసిన బిల్లులు విడుదల చేయాలని కోరారు. తక్షణమే తమ డిమాండ్లను పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండలంలో వివిధ గ్రామాలకు చెందిన మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న ఎండిఎం కార్మికులు

రాష్ట్ర ప్రయోజనాలు కాపాడటంలో వైసిపి ఎంపీలు విఫలం

ప్రజాశక్తి- అనకాపల్లి

రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడంలో వైసిపి ప్రభుత్వం, ఆ పార్టీ ఎంపీలు పూర్తిగా విఫలమైనట్లు టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు విమర్శించారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర సమస్యల మీద పార్లమెంట్లో గళమెత్తవలసిన ఎంపీలు కేవలం జగన్ రెడ్డి అవినీతి అక్రమాలు, సిబిఐ, ఈడి కేసులు నుండి కాపాడడానికి కోసమే పనిచేస్తున్నారని ఆరోపించారు. వైసీపీకి ఉన్న 31మంది ఎంపీలు ఈ నాలుగేళ్లలో రాష్ట్రానికి ఏం సాధించారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా, విశాఖ రైల్వే జోన్, పోలవరం పూర్తి వంటి హామీలిచ్చి ఓట్లు వేయించుకొని ప్రజలను మోసగించారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టడానికి ఫేక్ సర్వేలు చేయిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో టిడిపి నాయకులు బొర్రా నాగరాజు, దాడి జగన్, ఆళ్ల రామచంద్రరావు, విల్లూరి రమణబాబు, సాలాపు నాయుడు, బోడి వెంకటరావు, పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా చోడవరం-పిఎస్.పేట రోడ్డు

ప్రజాశక్తి-చోడవరం

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చోడవరం- పిఎస్.పేట రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. స్థానిక కొత్తూరు జంక్షన్ వద్ద ఉన్న బాలికల ఉన్నత పాఠశాల ముందు గుంతలు పడడంతో వాటిలోకి నీరు చేరి పాఠశాలకు విద్యార్థులు వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఒకరు చేయి ఒకరు పట్టుకుని ఎక్కడ నీటిలో పడతామన్న భయంతో బిక్కుబిక్కుమంటూ విద్యార్థినులు బుధవారం రాకపోకలు సాగించారు. తక్షణమే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



కొత్తూరు జంక్షన్‌లో వద్ద గోతుల్లో వర్షపు నీరు

అడుగడుగునా గోతులు

వర్షానికి నీరు చేరి ప్రయాణానికి యాతన

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

మండలంలోని పలు రహదారులకు అడుగడుగునా గోతులు పడడంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. ప్రధానంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ గోతుల నిండా నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని రాజాం – తట్టబంద రోడ్డులో తైపురం, చిట్టిపాలెం తదితర గ్రామాల వద్ద పెద్దపెద్ద గొయ్యిలు ఏర్పడ్డాయి. సీతయ్యపేట పెదపూడి, తట్టబంద, రావికమతం తదితర గ్రామాల నుండి ప్రతిరోజు వందలాది మంది కార్మికులు భవన నిర్మాణ పనులకు, చిన్నచిన్న వ్యాపారాల నిమిత్తం చిరువ్యాపారులు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఈ గోతుల్లో నీరు చేరడంతో వాహనదారులు రాకపోకలు సాగించడానికి నానా అవస్థలు పడుతున్నారు. కశింకోట –బంగారుమెట్ట రోడ్డు నుండి పెద్ద మదినా, గున్నెంపూడి రోడ్డు సైతం పూర్తిగా ధ్వంసమైంది. కొద్దిపాటి వర్షానికి గోతులు చెరువులను తలపిస్తున్నాయి. ఈ రోడ్డు గుండా కూడా కొండ పాలెం తదితర గ్రామాలకు చెందిన వందలాదిమంది అనకాపల్లికి కూలి పనులకు వెళ్లి వస్తూ ఉంటారు. ఈ రోడ్డు కూడా ప్రయాణం చేయడానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్నారు.



వర్షానికి తైపురం వద్ద రోడ్డుపై ఉన్న గోతుల్లో చేరిన నీరు



ప్రధాన రహదారిపై నిల్వ ఉన్న వర్షపు నీరు

చెరువులను తలపిస్తున్న రోడ్లు

కె.కోటపాడు : రోడ్లు భవనాలు శాఖ నిర్లక్ష్యం కారణంగా మండలంలోని పలు తారు రోడ్లు వర్షం పడితే నీరు బయటకు వెళ్లే మార్గం లేక చెరువులను తలపిస్తున్నాయి. కె.కోటపాడు నుండి పినగాడి వెళ్లే దారిలో జోగన్నపాలెం వద్ద ప్రధార రహదారిపై వర్షపు నీరు నిల్వ ఉంటుంది. అయ్యన్న కాలేజీ సమీపంలో మలుపు వద్ద కొద్దిపాటి వర్షానికి నీరు బయటకు వెళ్లే దారి లేక రోడ్డుపై నిలిచిపోతుంది. వాహనాలు అటు ఇటు తిరుగుతుండడంతో రోడ్డుపై గోతుల్లో నిల్వ ఉన్న నీరు చుట్టుపక్కల ఉన్న నివాసాల లోపలకు వెళుతుండటంతో ఇళ్లల్లో ఉన్నవారు అసౌకర్యానికి గురవుతున్నారు. రోడ్డుపై నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి అటు ఇటు డ్రైనేజీలు ఏర్పాటు చేస్తే నీరు బయటకు వెళ్తుందని పలువురు చెబుతున్నారు. కె.కోటపాడులో ప్రత్యేకంగా ఆర్ అండ్ బి సెక్షన్ ఆఫీసు ఏర్పాటు చేసినా.. ఆ కార్యాలయం ఎక్కడుందో ఎవరికీ తెలియదు. వర్షాలు పడినప్పుడు రోడ్డుపై నీరు నిల్వ లేకుండా ఆర్ అండ్ బి సిబ్బంది రోడ్డు పక్కన మట్టి కాలువలు ఏర్పాటు చేసిన ఆ మార్గం గుండా నీరు బయటకు పోతుందని స్థానికులు చెబుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.

అమెజాన్‌లో లక్కబొమ్మలు

ప్రజాశక్తి -యలమంచిలి

మండలంలోని ఏటికొప్పాక కళాకారులు తయారు చేస్తున్న లక్కబొమ్మల విక్రయానికి అమెజాన్ కంపెనీతో టయాప్ చేయడం జరిగిందని, దీని వలన ముందు కంటే ఇప్పుడు లాభాలు పెరిగే అవకాశం ఉంటుందని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ఏటికొప్పాక గ్రామంలో సంఘ సభ్యులతో సమావేశమై మాట్లాడారు. ఒక వారం రోజుల్లో ఇక్కడ ఉన్న సొసైటీ బిల్డింగ్‌లో కొత్తగా 2 లేతి మిషన్లు ఫిట్ చేసి కొత్త వారికి శిక్షణ ఇప్పించటం జరుగుతుందని తెలిపారు. కలర్స్ వేయటంలో ఆసక్తి ఉన్న సభ్యులకు కూడా శిక్షణ ఇవ్వటం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సంధ్యా రాము, కన్సల్టెంట్ పూజా, సిసి తల్లిబాబు, వెల్ఫేర్ అసిస్టెంట్ అప్పలరాజు, విఎఓ టి.ఆర్టిజాన్స్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి


మాట్లాడుతున్న చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

పాఠశాల భవనానికి రూ.35 కోట్లు మంజూరు

ప్రజాశక్తి -చోడవరం : మండలంలో జన్నవరం గ్రామంలో మహాత్మ జ్యోతిరావుపూలే స్కూల్ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.35 కోట్లు మంజూరు చేసిందని స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఇప్పటికే స్కూలు నిర్మాణం కోసం పది ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించమన్నారు. నియోజకవర్గాన్ని విద్య హబ్బుగా మార్చేందుకు కృషి చేస్తున్నామని, దీనిలో భాగంగా 17 కోట్ల రూపాయలతో వెంకన్నపాలెంలో పాలిటెక్నిక్ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని తెలిపారు. వారం రోజుల్లో వాటి నిధులు మంజూరు అవుతాయన్నారు. ఇప్పటికే నరసాపురం వద్దన్న కస్తూరిబా పాఠశాలకు ఇంటర్మీడియట్, చోడవరం డిగ్రీ కాలేజీలో పీజీ కాలేజీ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు దొడ్డి వెంకటరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ సత్యారావు, పినపోలు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో బుధవారం డ్వాక్రా మహిళలకు మామిడి, జీడి, కొబ్బరి మొక్కలను సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటుగా కాలుష్యాన్ని నియంత్రించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా సిఎ, ఆశా వర్కర్లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

సోషల్ మీడియా వేదికగా వైసిపిని ఎండగట్టాలి


ప్రజాశక్తి-అనకాపల్లి : టిడిపి శ్రేణులు సోషల్ మీడియా వేదికగా వైసిపి నిరంకుశ పాలనను ప్రజలకు వివరించి ఎండగట్టాలని మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం టిడిపి పట్టణ సమగ్ర శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి బూత్‌లో ముగ్గురు సభ్యులతో కమిటీల ఏర్పాటు చేయాలని సూచించారు. టిడిపి శ్రేణులు నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు బొర్రా నాగరాజు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

హెరిటేజ్ డెయిరీ పాల సేకరణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని నారప్పపాలెం గ్రామంలో బుధవారం హెరిటేజ్ డెయిరీ నూతన పాల సేకరణ కేంద్రాన్ని డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెరిటేజ్ డెయిరీతో పాడి రైతులు అధిక లాభాలు పొందవచ్చుని తెలిపారు. కార్యక్రమంలో రైతులు లాలం సంతోష్, లాలం నాయుడు, లాలం శ్రీనివాసరావు, కసిరెడ్డి అప్పారావు, లాలం భాస్కరరావు, లాలం అప్పారావు, లాలం గంగరాజు, లాలం సీతా రెడ్డి, లాలం రమేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - కశింకోట : కశింకోట డిపిఎన్ బాలుర హైస్కూల్ విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడానికి కారణమైన ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సన్మానించారు. స్థానిక యువ చారుటుబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధి మారుతి వెంకటాచార్యులు, న్యాయవాది సూరా శ్రీనివాస్ ఎమ్ఇఒ-2 సూర్య నారాయణ మూర్తి, హైస్కూల్ హెచ్ఎం ఆర్‌వి అప్పారావు, ఉపాధ్యాయులు ప్రభాకర్‌రావు నాగేశ్వరరావు, అప్పారావు శర్మ, సూర్య నారాయణ శాస్త్రి పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న యువ ట్రస్టు సభ్యులు

సమగ్ర పోషక యాజమాన్యాలపై అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి : కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, తుమ్మపాల శారద వ్యాలీ డెవలప్మెంట్ సమితి సంయుక్తంగా ఉత్తర కోస్తా రైతు ఉత్పత్తి సంస్థల సభ్యులకు సమగ్ర పోషక యాజమాన్యాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. తుమ్మపాల ఎస్వీడీఎస్ కార్యాలయంలో జరిగిన ఈ సదస్సులో కోరమండల్ రీజినల్ బిజినెస్ హెడ్ కెఎస్ఆర్ చక్రవర్తి మాట్లాడుతూ రసాయనిక ఎరువులు డబ్బాపాల లాంటివని, సేంద్రియ ఎరువులు తల్లి పాలలాంటివని తెలిపారు. రైతు ఉత్పత్తి సంస్థలకు న్యూట్రి క్లినిక్ ఏర్పాటు చేసే అవకాశముందాలన్నారు. అగ్రికల్చర్ ఆఫీసర్ సత్యనారాయణ మాట్లాడుతూ వరి, చెరుకు, చిరుధాన్యాల పంటలపై రైతులు దృష్టి సారించి నాణ్యమైన దిగుబడులు సాధించాలని సూచించారు. అంతర పంటగా చిరుధాన్యాలు, కూరగాయలు చేపట్టాలన్నారు. యాజమాన్య పద్ధతులు పాటించి నాణ్యమైన దిగుబడులు సాధించి రైతులు అధిక ఆదాయం పొందాలని కోరారు. డివిజనల్ ఆగ్రానమిస్ట్ మోహన్ కుమార్ సేంద్రియ ఎరువుల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఎస్వీడిఎస్ కార్యదర్శి కర్రి జోగినాయుడు, కోరమండల్ జోనల్ మేనేజర్ కీర్తి కృష్ణ, ఎగ్రనోమిస్టులు సూర్య, రమేష్, మార్కెటింగ్ ఆఫీసర్ హరికృష్ణ, సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


రైతులకు సూచనలు చేస్తున్న దృశ్యం

పోలియో వ్యాధిగ్రస్తుని వైద్యానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : పోలియో వ్యాధిగ్రస్తుని వైద్యానికి సాయానికి పది రూపాయల సంస్థ అండగా నిలబడి ఆర్థిక సహాయం అందించింది. మండలంలోని మెలిపాక గ్రామానికి చెందిన సర్వసిద్ధి భావనకు ముగ్గురు పిల్లలు. భర్త మరణించడంతో పేదరికంతో సంసారం నెట్టుకొస్తుంది. రెండో బాబు అక్షిత్ (8) పోలియో వ్యాధి గురికావడంతో పాటుగా రైట్ సైడ్ బ్లడ్ సర్కులేషన్ ఆగిపోయింది. వైజాగ్ కేర్ హాస్పిటల్‌ను సంప్రదించగా ఆపరేషన్‌కు నాలుగు లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. దీంతో ఆమె అనకాపల్లి ఎఎంఎఎల్ కళాశాల సాయానికి 10 రూపాయల సంస్థని ఆశ్రయించింది. సంస్థ అధ్యక్షుడు ఏసుబాబు దాతల దగ్గర నుండి రూ.8,71,900 పోగు చేసి భావన కుటుంబానికి ఎఎంఎఎల్ కళాశాల అధ్యాపకులు ఎం.హరిబాబు, ప్రముఖ హోమియో వైద్యులు శశిధర్ చేతులమీదుగా బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు ఏసుబాబు, గొర్లి వాసుదేవ నాయుడు, నూకేష్, సారథి, కాన్, నరసింహ రావు, గణేష్, రాముడు, సాయి, నాగేష్, లహరి, ప్రియాంక, సింధు, తరుణ్, తులసి, పద్మ, అంజలి, రమ్య, వెన్నెల, నవ్య పాల్గొన్నారు.

లాలం భాస్కరరావు మృతి టిడిపికి తీరని లోటు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : టిడిపి నాయకులు లాలం భాస్కరరావు అకాల మృతి పార్టీకి తీరని లోటు అని టిడిపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. అచ్యుతాపురం ఎన్‌కేఆర్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం పార్టీ ఎలమంచిలి నియోజకవర్గస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు, నాలుగు మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు భాస్కరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి భాస్కరరావు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ధూళి రంగనాయకులు, జనపరెడ్డి నర్సింగరావు, మెరుగు బాపు నాయుడు, లాలం తాత బాబు, ధర్మిరెడ్డి నాయుడుబాబు, కసిరెడ్డి ప్రసాద్, ఎంపీటీసీ నిరుకొండ నర్సింగ్‌రావు, మామిడి శివ అప్పారావు, యాండ్ర అప్పలనాయుడు, సర్పంచ్‌లు కొయ్య శ్రీను, వియ్యపు నానాజీ, పొనమళ్ళ కొండబాబు, పిల్లా వరలక్ష్మి, లాలం ప్రసాద్, ఏరిపిల్లి అజయ్, లాలం రాజు, పతివాడ చిన్నయ్యనాయుడు, కర్రి రమణ, లాలం రమణ పాల్గొన్నారు.


భాస్కర్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న టిడిపి నేతలు

రైవాడ కుడి కాలువ పరిశీలన

ప్రజాశక్తి-చోడవరం

రైవాడ రిజర్వాయర్ కుడి ప్రధాన కాలువ (ఆర్ఎంసి) చోడవరం ఇరిగేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీదేవి బుధవారం ఆయకట్టు రైతులతో కలిసి పరిశీలించారు. రైతుకూలీ సంఘం ఆధ్వర్యాన ఆయకట్టు రైతులు సోమవారం జిల్లా కలెక్టరేట్ 'స్పందన' కార్యక్రమంలో విన్నవించిన నేపథ్యంలో లక్కవరం, సింహాద్రిపురం ఆయకట్టు రైతులను ఆమె వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయకట్టు భూముల విస్తీర్ణం ఆధారంగా సాగునీటి పంపకాలు అమలు చేయాలని, వృధాగా పోతున్న నీటిని అరికట్టాలని, కాలువల్లో పూడికను తొలగించాలని, ఆధునికీకరణ చేసి, డ్రాప్‌లకు గేట్లు అమర్చాలని రైతులు ఆమెను కోరారు. పైఅధికారులతో చర్చించి, సమస్యల పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్ రావు, పైలా రమేష్, రైతులు వేచలపు నారాయణ మూర్తి, బండారు నాయుడు, సబ్బవరపు వెంకటరమణ, సబ్బవరపు గోవింద్ పాల్గొన్నారు.

జెడ్‌పి హైస్కూల్‌కు సిసి కెమెరాల వితరణ

ప్రజాశక్తి - కె.కోటపాడు

కె.కోటపాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 1984-85 వరకు విద్య నభ్యసించి, ప్రభుత్వ, ప్రైవేటు, వ్యాపారాల్లో స్థిరపడిన పూర్వపు విద్యార్థులు రూ.22వేలు విలువచేసే సీసీ కెమెరాలను ఆ పాఠశాలకు అందించారు. వీటిని పాఠశాల ఆవరణ చుట్టూ నాలుగు కెమెరాలు అమర్చి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్ఎం పద్మావతి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పూర్వపు విద్యార్థులు కృషి అభినందనీయమన్నారు. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న గోపాల్ మాట్లాడుతూ నేటి విద్యార్థులు మొబైల్ ఫోన్‌కి అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోకుండా చదువుపై దృష్టి పెట్టి మంచి ప్రయోజకుల కావాలని కోరారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు చిరికి రామకృష్ణ, బండారు శివకాశి బాబు, సూరిశెట్టి ఈశ్వరరావు, కాకి వెంకట్రావు, పల్ల అచ్చిబాబు, నీలి శ్రీను, ఉపాధ్యాయులు ఎర్నాయుడు, మురళీకృష్ణ, కామేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పీడీ లక్ష్మీపతి

మండల మహిళా సమాఖ్య సమావేశం

ప్రజాశక్తి బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండల మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో బుధవారం మహిళా సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డిఆర్డిఏ పిడి బి.లక్ష్మీపతి ఎస్‌హెచ్ బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. గ్రీన్ మిలీనియం కార్యక్రమంలో భాగంగా పచ్చదనాన్ని పెంచే విధంగా మొక్కలను పెంపకాన్ని ప్రోత్సహించాలని కోరారు. డ్వాక్రా సంఘాల రుణాల రికవరీని పెంచే విధంగా సభ్యులకు అవగాహన కలిగించాలన్నారు. ఈ సమావేశంలో ఏరియా కోఆర్డినేటర్ చోడవరం రత్నప్రభ, మండల ఏపీఎం వై.బాలరాజు, సీసీలు కొండయ్య, గణపతి, గణేష్ రాజు, వెంకట్రావు, కృష్ణారావు, నాగేశ్వరరావు, రాజేశ్వరి, వివోఏలు సభ్యులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై ఖాతాదారులకు అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి : సైబర్ నేరగాళ్ళ నుంచి అప్రమత్తంగా ఉండాలని ఖాతాదారులకు ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ తుమ్మపాల శాఖాధికారి కుప్పిలి వెంకట శ్రీనివాసరావు సూచించారు. తుమ్మపాల బ్యాంకులో బుధవారం ఖాతాదారుల సమావేశంలో మాట్లాడారు. బయో మెట్రిక్ నేరాలపై ఖాతా దారులు అవగాహనతో కలిగి ఉండాలన్నారు. తమ చరవాణిలో ఎంఆధార్ యాప్ ద్వారా తమ బయో మెట్రిక్ లాక్ చేసుకోవాలని సూచించారు. గృహ రుణాలు అన్ని ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల కన్నా తమ బ్యాంక్ తక్కువ వడ్డీతో ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ మోటమర్రి శ్రీనివాసరావు, క్యాషియర్ కుంచంగి శంకరరావు, ఖాతాదారులు పాల్గొన్నారు.

వంగవీటి మోహనరంగా విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం పట్టణం అన్నవరంలో ఏర్పాటు చేసిన వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని మంగళవారం రాత్రి రంగా తనయుడు వంగవీటి రాధా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాధా మాట్లాడుతూ కిందిస్థాయి నుండి నాయకత్వ లక్షణాలు అలవర్చుకుని తన తండ్రి పేదల కోసం ప్రాణాలు అర్పించారని తెలిపారు. ఆయన మరణించి 34 సంవత్సరాలు గడుస్తున్న ఇంకా ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా ఉన్నారన్నారు. స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ మోహనరంగా డేరింగ్ డాషింగ్ కలిగిన నాయకుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి చోడవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ సత్యారావు, పుల్లేటి వెంకటేష్, కాపు సామాజిక తరగతికి చెందిన నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు నిరంతర సేవలు

ప్రజాశక్తి-చోడవరం : విద్యుత్ వినియోగదారుల ఎటువంటి ఇబ్బందులకు తలెత్తకుండా నిరంతర సేవలు అందిస్తున్నామని విద్యుత్ శాఖ ఎస్ఈ ఎల్.మహేంద్ర నాథ్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పెరిగిన విద్యుత్తు అవసరాలకు అనుగుణంగా ఆర్‌డిఎస్ఎస్ 33 బై 11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌ను నరసయ్యపేట గ్రామంలో ఏర్పాటు చేయనున్నామని, దీని కోసం కార్పొరేషన్ కార్యాలయానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. చోడవరం, పరిసర గ్రామాల్లో గతేడాది కాలంలో అంకుపాలెం, శ్రీరామపట్నం, గాంధీ గ్రామం, నరసయ్యపేట, గౌరీపట్నం, లక్ష్మీపురం, దామనాపల్లి గ్రామాల్లో పది విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు.

రావలమ్మ ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని మల్లునాయుడు పాలెం గ్రామంలో రావలమ్మ ఆలయ నిర్మాణానికి వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు, అతని సోదరుడు, వైస్ ఎంపీపీ-2 చొక్కాకుల గోవింద రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందించారు. వారికి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు బోను గంగు నాయుడు, ఇతర సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గొర్లి కనకరాజు, దేముడు, రొంగలి వెంకట రమణ, సింగంపల్లి సింహాచలం, బోను వాసు తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న వైస్ ఎంపిపి గోవింద



దీక్షలో కూర్చున్న గిరిజనులు

కొనసాగిన రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-కోటవురట్ల:అణుకు గ్రామానికి రహదారి, పాఠశాల నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం 13వ రోజుకు చేరుకుంది. పాఠశాల, రోడ్డు నిర్మాణం చేపట్టాలని గిరిజనులు శిబిరం వద్ద నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండల సిపిఎం నాయకులు డేవిడ్‌రాజు మాట్లాడుతూ, సమస్యలు పరిష్కరించే వరకు దీక్ష విరమించేది లేదని అన్నారు.

తీగల తొలగింపు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-కోటవురట్ల:అల్లుకున్న నిర్లక్ష్యం అంటూ బుధవారం ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి విద్యుత్తు అధికారుల్లో స్పందన లభించింది. మండల కేంద్రంలో సీతా రామరాజునగర్ విద్యాన్ స్కూల్ సమీపంలో విద్యుత్ స్తంభానికి తుప్ప తీగలు అల్లుకోవడంతో స్తంభం నుంచి నిప్పు రవ్వలు పడుతూ ఉండేవి. దీంతో, సమీపవాసులు, విద్యార్థులు ఆందోళన వ్యక్తం వ్యక్తం చేసేవారు. ప్రజాశక్తి కథనానికి అధికారులు స్పందించి తుప్ప తీగలను తొలగించారు. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



స్తంభంపై తొలగించిన తీగలు



నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

ఉమెన్ చాందీకి ఘన నివాళి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేరళ మాజీ ముఖ్యమంత్రి ఉమెన్ చాందీకి బుధవారం పిసిసి సభ్యులు మీసాల సుబ్బన్న నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సుబ్బన్న మాట్లాడుతూ, ఉమెన్ చాందీ కేరళ శాసనసభకు వరుసగా 12 సార్లు ఎన్నిక అయ్యారని, రెండుసార్లు ఆ రాష్ట్రానికి ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టారని తెలిపారు. ఆయన మన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల పరిశీలకునిగా ఎన్నో సేవలను అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నంగిన రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్దా, ముత్యాల శివ, అడ్డూరి రామారావు, రాజానరాజు, బొంతు రమణ పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను ఖండిస్తూ

ఎస్ఎఫ్ఐ నేతల నిరసన



నక్కపల్లిలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు



నర్సీపట్నంలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-నక్కపల్లి:ఎస్ఎఫ్ఐ నాయకుల అక్రమ అరెస్టులను ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మామిడి రమణ, ఎస్‌రమణ తీవ్రంగా ఖండించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు అరెస్టును వ్యతిరేకిస్తూ విద్యార్థులతో కలిసి హైవే వద్ద నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులు భర్తీ చేయాలని ,పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయాలని , మధ్యాహ్నం భోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన తాడేపల్లి సీఎం క్యాంప్ ఆఫీస్ ముందు నిరసన కార్యక్రమం చేపట్టగా రాష్ట్ర నాయకత్వాన్ని ప్రభుత్వం పోలీసులతో అక్రమ అరెస్టులు చేయించి మంగళగిరి పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగిందన్నారు. కళాశాలలు తెరిచి రెండు నెలల కావస్తున్నా ఇప్పటికీ పాఠ్యపుస్తకాల ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు.సమస్యలు పరిష్కరించాలని స్వచ్ఛందంగా నిరసన తెలియజేస్తున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకత్వాన్ని అక్రమంగా అరెస్టులు చేయడం దారుణమన్నారు. నాయకత్వాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు . ఎస్ఎఫ్ఐ నాయకత్వం ప్రభుత్వం దష్టికి తీసుకువచ్చిన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని లేనియెడల జిల్లా వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కౌశిక్, ప్రభాకర్, సింహాద్రి,విద్యార్థులు పాల్గొన్నారు .

నర్సీపట్నంటౌన్: న్యాయ పోరాటం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేయడం తగదని, వెంటనే విడుదల చేయాలని బుధవారం ఎస్ఎఫ్ఐ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నర్సీపట్నం డివిజన్ సెక్రెటరీ జి.గీత కృష్ణ మాట్లాడుతూ, కాలేజీ లెక్చరర్ పోస్టులను భర్తీ, మధ్యాహ్న భోజన పథకం అమలు, విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు దుర్మార్గంగా అరెస్టులు చేయడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

నది నుంచి వచ్చే దారికి అడ్డంగా కందకం తవ్వకం

ప్రజాశక్తి -కోటవురట్ల:గొట్టువాడ వరహా నది సమీపం నుండి అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు స్థానిక పోలీసులు చర్యలు తీసుకున్నారు. వరహా నది సమీపం నుండి రాత్రి సమయంలో నిత్యం ఇసుకను అక్రమ రవాణా చేపడుతున్నారు. ఇటీవల పట్టపగలే జెసిపి సహాయంతో స్థానిక నాయకులు ఇసుకను తరలిస్తున్నా అధికారులు పట్టించుకోలేదనే విమర్శలు గుప్పు మనడంతో ఈ మేరకు పోలీసులు చర్యలు చేపట్టారు. గొట్టువాడ కేంద్రంగా ఇసుకను రాత్రి సమయంలో స్థానిక నాయకుల సహకారంతో వివిధ ప్రాంతాలకు తరలిండాన్ని గమనించిన స్థానిక పోలీసులు ఆదివారం నది నుంచి వచ్చే దారికి అడ్డంగా కందకం తవ్వించారు. అయినా అక్రమార్కులు పక్క మార్గం నుంచి తరలించుకు పోతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఇక్కడ నది నుంచి తరలించుకు వెళ్లిన ఇసుక వనరులు ఓ అధికార పార్టీ వ్యక్తి రహస్య ప్రదేశంలో నిల్వ ఉంచి అక్కడి నుంచి విశాఖకు లారీలపై తరలిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ తతంగమంతా గడిచిన రెండు, మూడు సంవత్సరాలగా జరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు. నదీ పదివాహక ప్రాంతాలైన మండల సరిహద్దు గ్రామాలు కావడంతో పందూరు, రాజుపేట, చౌడువాడ సహా కైలాసపట్నం గ్రామాల నుండి ఇసుకను అక్రమంగా రాత్రి సమయంలో ఇతర ప్రాంతాలకు తరలించుకు పోతున్నారు. అధికారులు ఇప్పటికైనా అక్రమ ఇసుక రవాణాకు పూర్తి స్థాయిలో అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.



గొట్టువాడ నది వద్ద తవ్విన కందకం

బస్టాండ్ స్థలం చదును పనులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద స్థలం లీజుకు ఇస్తున్నట్లు ఇప్పటికే ఆర్టీసీ అధికారులు టెండర్లు ప్రకటించారు. ప్రధాన బస్టాండ్ వద్ద 1.5 ఎకరాల స్థలం 15 సంవత్సరాల పాటు విశాఖపట్నంనకు చెందిన డాక్టర్ తీసుకున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో స్థలాన్ని చదును చేసే పనులు బుధవారం చేస్తున్నారు. 15 సంవత్సరాల పాటు నెలకు నాలుగు లక్షలు రూపాయలు అద్దె చెల్లించే విధంగానూ జి ప్లస్ వన్ నిర్మించుకొనుటకు లీజుకు తీసుకున్నట్లు తెలిసింది. గతంలో ఈ స్థలాన్ని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావుకు సంబంధించిన ప్రత్యూష కంపెనీ లీజుకు తీసుకున్నారు. అప్పటి రోడ్లు భవనాల శాఖ మంత్రిగా ఉన్న మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అడ్డుకున్నారు. పెరుగుతున్న ప్రయాణీకుల దృష్ట్యా ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ఇంకా విస్తరించాల్సి ఉందని, ఇక్కడ భవనాలు నిర్మిస్తే వారు ఇబ్బందులు గురవుతారని అప్పట్లో అయ్యన్నపాత్రుడు భవనాలు నిర్మించవద్దని అడ్డుకున్నారు. మరలా ఇక్కడ భవనాలు నిర్మించేందుకు సన్నద్ధం చేస్తున్న క్రమంలో ఏమి జరుగుతుందో వేచి చూడాల్సిందే.

వ్యాపారస్తులతో పోలీసుల సమావేశం



మాట్లాడుతున్న ఎఎస్‌పి

ప్రజాశక్తి-నర్సీపట్నం:టౌన్: నియోజవర్గంలో వ్యాపారస్తులు, కాలేజీల నిర్వహకులతో ఎడిషనల్ ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా ఏఎస్పీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యాపారస్తులు ప్రతి ఒక్కరు రిజిస్టర్ నిర్వహించాలని, షాప్ కి వచ్చే వారి ఐడెంటిటీ కార్డు పరిశీలించాలని, ప్రతి షాప్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎఎస్‌పి సూచించారు. డాక్టర్ చీటీ లేకుండా ఎటువంటి మందులు ఇవ్వవద్దని, అందరూ సహకరించాలని కోరారు.

పాయకరావుపేట:యాసిడ్ దాడుల నియంత్రణకు పాయకరావుపేటలో బంగారు వర్తకులు, కళాశాలకు సంబంధించిన లాబరేటరీ నిర్వాహకులు, రసాయనాల విక్రయదారులు, మెడికల్ షాప్ యాజమాన్యులతో సీఐ అప్పలరాజు బుదవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పాయిజన్ యాక్ట్ 1919, ఏపీ పాయిజన్ విక్రయాలు రూల్స్ 2016 మేరకు రసాయనాల విక్రయం, వినియోగంలో దుర్వినియోగం కాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. నిబంధన లను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

పోషకాహారాన్ని అందించాలి

ప్రజాశక్తి-కోటవురట్ల:విద్యార్థులకు పోషక విలువలతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ సూచించారు. బుధవారం ఆమె పాములవాక జిల్లా పరిషత్ పాఠశాలను ప్రదర్శించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న స్టడీ మెటీరియల్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రమైన తాగునీరు అందిం చాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న ఉదయశ్రీ

విద్యార్థులకు రక్త పరీక్షలు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండలంలో పెనుగోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజేశ్వరి ఆదేశాల మేరకు హెల్త్ వెల్నెస్ సెంటర్ పర్యవేక్షకులు షేక్ అమీర్ షాజిద్ కొర్రుప్రోలు గ్రామంలో ఎంపీపీ జడ్పీ స్కూల్ విద్యార్థులకు . రక్త పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎనీమి యాతో బాధపడుతున్న పిల్లలకు ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు ఇస్తామన్నారు. పిల్లలు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఇ శ్రీనివాస్, హెల్త్ సూపర్వైజర్స్ ఆదినారాయణమూర్తి, సాయి హెల్త్ సెక్రటరీ లక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పొదుపుతో కుటుంబాల అభివృద్ధి

ప్రజాశక్తి-చీడికాడ:కుటుంబంలో మహిళల పొదుపుతోనే అభివృద్ధి చెందుతాయని స్వాతి పొదుపు సంఘం అధ్యక్షురాలు పాత్రుని రమణమ్మ తెలిపారు. మండల కేంద్రంలోని తులసి రామ్ కళ్యాణ మండపంలో స్వాతి పొదుపు సహకార సంఘం 29వ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు పొదుపును అలవాటు చేసుకోవాలని, ఆ ఉద్దేశంతో స్వాతి మ్యాక్స్ ఏర్పాటు చేశామన్నారు. సంఘంలో సభ్యురాలు మరణిస్తే బాధితకుటుంబానికి కొంత ఆర్థిక సహాయంతో పాటు ఆ సభ్యుల సంస్థలో ఉన్న రుణాన్ని సంఘ సభ్యులే సమకూర్చుకొని చెల్లిస్తారని తెలిపారు. ఎల్ఎన్ పురం గ్రామం సమీపంలో కుటీర పరిశ్రమను ఏర్పాటు చేశామని, గ్రామీణ మహిళలకు, పురుషులకు ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజర్ దేవుడమ్మ, కుటీర్ పరిశ్రమ సిఈఓ శ్రీనివాస్ సంఘం డైరెక్టర్లు పాల్గొన్నారు.



హాజరైన సంస్థ ప్రతినిధులు



సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే, ఆర్‌డిఒ

రోడ్డు విస్తరణపై సమావేశం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మున్సిపాలిటీలో రోడ్డు విస్తరణ పనులు ఈనెల 21 నుండి ప్రారంభించేందుకు స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ఆధ్వర్యంలో బుధవారం అధికారులు, నాయకులు అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా ప్రభుత్వ స్థలాలలో విస్తరణ ప్రక్రియను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే కొందరు భవన యజమానులు, వ్యాపారులు 80 అడుగుల మేర రోడ్డు విస్తరించాలని కోర్టును ఆశ్రయించారు. ఆ తీర్పు వెలువడక ముందే ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రెవెన్యూ, మున్సిపల్, ఎలక్ట్రికల్, పోలీస్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. ప్రభుత్వ స్థలాల్లో ఉన్న వారిని ఖాళీ చేయించాయని, ఆ తర్వాత కరెంట్ పోల్స్ తొలగింపునకు చర్యలు తీసుకుంటారు. ఆ వెంటనే భవనాలు తొలగింపుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. పూర్తి వివరాలను మీడియాకు వెల్లడించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు ఆసక్తి చూపలేదు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జయరాం, మున్సిపాలిటీ కమిషనర్ కనకరావు, మున్సిపల్ ఛైర్మన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ ఛైర్మన్ తమనార అప్పలనాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఏకా శివ, కౌన్సిలర్స్ మాకిరెడ్డి బుల్లి దొర, సిరసపల్లి నాని, రోజా, శేషు పాల్గొన్నారు.

ఎక్స్ రే సేవలు ప్రారంభం

ప్రజాశక్తి-నక్కపల్లి:స్థానిక 50 పడకల ఆసుపత్రిలో ఎక్స్ రే సేవలను తిరిగి ప్రారంభించారు. బదిలీపై వచ్చిన రేడియోగ్రాఫర్ రాక పోవడంతో ఎక్స్ రే రూమ్ మూతపడింది. దీంతో 10 రోజుల పాటు ఎక్స్ రే సేవలు పూర్తిగా నిలిచి పోయాయి. ఎక్స్ రే అవసరమగు రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రేడియోగ్రాఫర్ లేనందున ఎక్స్ రే సేవలు నిలిచి పోవడంతో రోగులు పడుతున్న ఇబ్బందులను ఇటీవల ప్రజాశక్తి దినపత్రికలో కూడా ప్రచురణమైంది.అధికారులు స్పందించి ఎక్స్ రేలు తీసేందుకు నర్సీపట్నం ఆసుపత్రి నుండి రామచంద్రను డిప్యూటేషన్‌పై నియమించడంతో ఎక్స్ రే సేవలం దించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఈశ్వర ప్రసాద్ మాట్లాడుతూ, డిప్యూటేషన్ పై వచ్చిన రామచంద్ర స్థానిక ఆసుపత్రిలో వారానికి నాలుగు రోజుల పాటు సోమ, బుధ, శుక్ర, శనివారాల్లో అందుబాటులో ఉటారన్నారు. పూర్తిస్థాయిలో రేడియోగ్రాఫర్ ను నియమించాలని కోరుతూ ఉన్నతాధికారులకు లేఖ రాసినట్లు తెలిపారు. ఈసి జి యంత్రం కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు .


ఎక్స్ రే తీస్తున్న రామచంద్ర

రేడియోగ్రాఫర్ ను నియమించాలి

నక్కపల్లి 50 పడకల ఆసుపత్రిలో రోగులకు ప్రతిరోజు ఎక్స్ రే సేవలను అందించే విధంగా పూర్తిస్థాయిలో రేడియోగ్రాఫర్ ను నియమించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు కోరారు.


చేపలు పడుతూ నిరసన తెలుపుతున్న టిడిపి నేతలు

రహదారుల మరమ్మతుపై నిర్లక్ష్యం

ప్రజాశక్తి-మాడుగుల:వైసిపి ప్రభుత్వ హయాంలో రహదారులు అధ్వానంగా తయారయ్యాని మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు విమర్శించారు. బుధవారం కింతలి ఘాట్ రోడ్ రహదారి పరిశీలించి మాట్లాడుతూ, రహదారులపై గుంతలు ఏర్పడి నీరు చేరి చేపల చెరువులా మారాయని అన్నారు. ఉపముఖ్యమంత్రి చేసిన అభివృద్ధి ఏదీ అని ప్రశ్నించారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం పాల్పడుతుందని గొప్పలు చెప్పుకోవడం కాదని వాస్తవాలు ప్రజలు సైతం గమనిస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా చేపల వలలతో రహదారిపై నిరసన చేపట్టారు.

అనంతరం అవురువాడలో సీతారామ స్వామి దేవాలయానికి రామానాయుడు 50 బస్తాల సిమెంట్ బుధవారం విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చింతలపాటి బుజ్జి, టిడిపి నేతలు కాశిబాబు, సూర్యానారాయణ రాజు, రాజకుమార్, అప్పన రమణ, బాబ్జి, సోమన్న దొర, వలసయ్య రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ మారీ టైం

ఇండియా సమ్మిట్ ప్రారంభం

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో : గ్లోబల్ మారీ టైం ఇండియా సమ్మిట్ జిఐఎంఎస్- 2023 కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని ముంబైలో బుధవారం ప్రారంభమైంది. కేంద్ర పోర్టులు నౌకాయాన జల రవాణా శాఖామంత్రి శర్వానంద సోనోవాల్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఢిల్లీలోని ప్రగతి మైదానంలో అక్టోబర్ 17 నుంచి 19 వరకు జిఐఎంఎస్ -2023 నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. నూతన పెట్టుబడి అవకాశాలను కల్పించడం, సులభతర వాణిజ్య విధానం, వాణిజ్యంలో సహకారాన్ని పెంపొందించుకోవడం, సాంకేతిక, వైజ్ఞానిక విభాగాలలో భాగస్వామ్యాలను పెంపొందించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. అన్ని మేజర్ పోర్టుల ఛైర్మన్లు వర్చువల్‌గా ఈ కర్టెన్ రైజర్‌లో పాల్గొన్నారు. విశాఖపట్నం పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు, డిప్యూటీ ఛైర్మన్, సెక్రటరీ విభాగాధిపతులు, అధికారులు ఈ సమావేశంలో వర్చువల్‌గా పాల్గొన్నారు.

చందనాడ దళితుల భూములకు

నష్టపరిహారం చెల్లించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని చందనాడ దళితుల భూములకు నష్ట పరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం చందనాడ చెందిన దళితులు గుళ్ళ బట్టీలు నిర్వహిస్తున్న భూములను, డి పట్టా భూములను అధికారులు సేకరించారు. ఇప్పటి వరకు పరిహారం అందకపోవడంపై దళితులు తమ సమస్యను లోకనాథం దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు ఆయన భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ, గ్రామానికి చెందిన దళితులు పూర్వం నుండి గుళ్ళ బట్టీలు నిర్వహిస్తూ ఉపాధి పొందడం జరుగుతుందన్నారు. వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ప్రభుత్వం దళితుల ఆధీనంలో ఉన్న డి పట్టా భూములను సేకరించిందని తెలిపారు. నేటి వరకు పరిహారం చెల్లించకపోవడం దారుణమన్నారు. వెంటనే దళితులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం.రాజేష్, స్థానికులు పెదపూడి రమణ, యేడిద సన్యాసి, యేడిద మన్నియ్య, యేసు, దేముడు తదితరులు పాల్గొన్నారు.


దళితులతో మాట్లాడుతున్న లోకనాథం


స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పార్టీలన్నీ పోరాడాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలంటూ కమ్యూనిస్టులు పోరాటం సాగిస్తున్నారని, వీరికి అన్ని పార్టీలూ అండగా ఉండాలని విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ విజ్ఞప్తిచేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 839వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి అధికారంలోకి రాకముందు చదువుకున్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ అమ్మేస్తోందని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయం పట్ల ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మౌనంగా ఉండడం సరికాదన్నారు. రాష్ట్రంలోని అన్ని పార్టీల ఎంపీలు, ఎమ్మెల్యేలు స్టీల్‌ప్లాంట్‌ను కాపాడేందుకు కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా మోటారు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు, ఆటో కార్మిక సంఘం నాయకులు కెవి.రమణ, జి.ప్రకాష్, బంధపు రాంబాబు, అప్పలరెడ్డి, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణపై లుకలుకలు

-ఎమ్మెల్యే గణేష్, సన్యాసిపాత్రుడు విడివిడిగా కార్యక్రమాలు

-ముదురుతున్న అంతర్గత పోరు



ఎమ్మెల్యే గణేష్


సన్యాసిపాత్రుడు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :పట్టణంలో రోడ్డు విస్తరణపై వైసిపి పార్టీలో వర్గ పోరు తేటతెల్లమైంది. ఈ వర్గపోరు తీవ్రత.. అతి తీవ్రత అని లెక్కలు కట్టడానికి కొలమానాలు కూడా సరిపోవడం లేదని నర్సీపట్నం మున్సిపాలిటీలో కొందరు వైసీపీ నేతలే వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. ముఖ్యంగా రోడ్డు విస్తరణ నేపథ్యంలో చింతకాయల సన్యాసిపాత్రుడుకు ఎమ్మెల్యేకు మధ్య అంతర్గత పోరు నడుస్తోంది. ఇందులో భాగంగానే సన్యాసి పాత్రుడు(జమీలు) సతీమణి అనిత డిసిసిబి చైర్ పర్సన్ పదవికి గండం ఏర్పడిందని నియోజకవర్గంలో బాహటంగా చెప్పుకుంటున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, సన్యాసిపాత్రుడు విడివిడిగా కార్యక్రమాలు నిర్వహించడం పలు అనుమానాలకు దారి తీసింది. ఇటీవల వైయస్ రాజశేఖర్ రెడ్డి పుట్టినరోజు కార్యక్రమాలు వేరు వేరుగా నిర్వహించారు. పట్టణంలో రోడ్డు విస్తరణకు ఎమ్మెల్యే గణేష్ పట్టుదలతో ఉన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా స్థానిక షాపు భవన యజమానులకు సన్యాసి పాత్రుడు అండగా నిలుస్తూ రాష్ట్రస్థాయి పెద్దలను కలిసినట్లు తెలిసింది. ఇటీవల పోతల ప్రసాద్ మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి రోడ్డు విస్తరణ పనులు ఇప్పట్లో చేపట్టేది లేదని చెప్పడం వ్యవహారం వెనుక న సన్యాసి పాత్రుడు హస్తం ఉన్నట్లుగా భావిస్తున్నారు. ఈ వర్గ పోరు కారణంగా సన్యాసి పాత్రుడు సతీమణి చింతకాయల అనితపై పడిందని, ఈ క్రమంలోనే ఆమె డిసిసిబి చైర్పర్సన్ పదవికి గండం ఏర్పడిందని నియోజకవర్గంలో బాహటంగానే పలువురు మాట్లాడుకుంటున్నారు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో నియోజకవర్గంలో వైసీపీలో నెలకొన్న విభేదాలకు చెక్ పెట్టకుంటే మొదటికే మోసం రావొచ్చని కార్యకర్తలు హెచ్చరిస్తున్నారు.

ఇటీవల మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ఆదిలక్ష్మి ఆమె అన్నయ్య జిఎన్ఆర్ ఎమ్మెల్యే పట్ల గుర్రుగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఆమె పదవి నుండి తొలగిన తర్వాత ఏ కార్యక్రమంలోనూ ఎమ్మెల్యేతో ఆదిలక్ష్మి పాల్గొనక పోవడం నియోజకవర్గం లో చర్చ నీయాంశంగా మారింది. ఈ వర్గ పోరు సమస్య శ్రుతి మించకుండా పార్టీ పెద్దలు ఎలాంటి మంత్రం వేస్తారో వేచి చూడాలి.

గుడిమెట్ల సత్తిరెడ్డి కన్నుమూత



ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ జనరల్ మేనేజర్ గుడిమెట్ల సత్తిరెడ్డి (85) అనారోగ్యంతో సాగర్‌నగర్ ఉడా సెక్యార్‌లోని స్వగృహంలో మృతి చెందారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు గుడిమెట్ల మధుకుమార్ డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్‌గా వ్యవహరిస్తున్నారు. రెండవ కుమారుడు గుడిమెట్ల రవిరెడ్డి వైసిపి రాష్ట్ర అదనపు కార్యదర్శిగా ఉన్నారు. గుడిమెట్ల సత్తిరెడ్డి మెటీరియల్ మేనేజ్‌మెంట్ ఫౌండర్‌గా విశాఖపట్నానికి సర్టిఫికెట్ కోర్సు ద్వారా ఎంతో మంది విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చి దిద్దడంలో కీలక పాత్ర పోషించారు. దేశ విదేశాల్లో అత్యున్నతమైన చదువులను విద్యార్థులు అభ్యసించేలా మెలకువలు తెలియజేయడంలో సత్తిరెడ్డి సిద్ధహస్తులు. బిహెచ్‌పివిలో మేనేజర్‌గా విధులు నిర్వహించి, తరువాత స్టీల్‌ప్లాంట్లో జనరల్ మేనేజర్ హోదాలో ఉద్యోగ విరమణ పొందారు. సత్తిరెడ్డి మృతి పట్ల మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వేమన సంక్షేమ సంఘం అధ్యక్షులు నీలాపు వివేకానందరెడ్డి, నాగార్జున యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ బాలమోహన్ దాస్, గీతం మాజీ వీసీ సుబ్రహ్మణ్యం, డిసిపి ఆనందరెడ్డి, ప్రిజం కాలేజీ కరస్పాండెంట్ సత్యనారాయణరెడ్డి, రాజకీయ పార్టీల నేతలు పంచకర్ల రమేష్‌బాబు, చొక్కాకుల వెంకటరావు, జాన్ వెస్లీ, పిఎస్ఎన్.రాజు, జగ్గుపల్లి అప్పలరాజు, ద్రోణంరాజు శ్రీవాత్సవ, అల్లంపల్లి రాజబాబు, మన్నాల శ్రీనివాస్, బుల్లయ్య కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి-నక్కపల్లి:అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడం జరుగుతుందని ఎమ్మెల్యే బాబూరావు తెలిపారు. పెదదొడ్డిగల్లు సచివాలయం వద్ద జరిగిన జగనన్న సురక్షలోట ఆయన మాట్లాడారు. ప్రజా సంక్షేమ ధ్యేయంగా పాలన సాగిస్తున్నామని తెలిపారు. సంక్షేమ ఫలాలను ప్రజల ముంగిటికే అందిస్తున్నామన్నారు. లబ్దిదారులకు ధృవీకరణ పత్రాలు అందజేశారు. నక్కపల్లి సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామరాజు, తహసీల్దార్ అంబేద్కర్, ఈఓపిఆర్డీ వెంకట నారాయణ, సర్పంచ్‌లు గొర్ల విజయలక్ష్మి, ముల్సిపాబేగం, జయ రత్న కుమారి, మండల పరిషత్తు ఉపాధ్యక్షులు వీసం నానాజీ, ఎంపిటీసీ సభ్యులు గొర్ల దుర్గ, నక్కపల్లి పిఎ సిఎస్ చైర్ పర్సన్ తాతబాబు, నాయకులు శీరం నరసింహ మూర్తి, సూరకాసుల గోవింద, నాగ అప్పలరాజు, గొర్ల గోవింద రాజులు, బాబురావు, వీసం రాజు, బంగారు రాజు పాల్గొన్నారు.

చీడికాడ:ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలు పథకాలు ప్రజలందరికీ నూరు శాతం అందేటట్లు చూడటమే జగనన్న సురక్ష ధ్యేయమని గ్రామ సర్పంచ్ కోడూరు సత్యవతి అన్నారు. చీడికాడ మండలం జైతవరం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ బివి రాణి మాట్లాడుతూ, జగనన్న సురక్షతో 11 రకాల సేవలను ప్రజలకు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ జయమ్మ మాట్లాడుతూ, జగనన్న పరిపాలనలో సంక్షేమ ఫలాలు ప్రజలకు అవినీతి లేకుండా అందుతు న్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయప్రకాష్, వైసీపీ నాయకుడు లాలం జానకిరామ్ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కోటవురట్ల:సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ తెలిపారు. పాములవాకలో తహసీల్దార్ జానకమ్మ, అన్నవరంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ దత్తుడు రాజు, పాములవాక సర్పంచ్ సత్యవతి, డిప్యూటీ తహసిల్దారు సోమశేఖర్, ఈఓపిఆర్డి సుబ్రహ్మణ్యం, వైసిపి నాయకులు అయ్యపురెడ్డి బాబ్జి, శెట్టి ఎర్రంనాయుడు పాల్గొన్నారు.

గొలుగొండ:గొలుగొండ గ్రామంలో సర్పంచ్ కసిపల్లి అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన జగనన్న సురక్షలో వ్యవసాయ అధికారి బి.మోహన్‌రావు మాట్లాడుతూ, ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం 11 రకాల ధ్రువపత్రాలను అందజేస్తుందన్నారు. ధ్రువపత్రాలతో పాటు రేషన్ కార్డులను అందజేస్తుందన్నారు. పప్పుశెట్టిపాలెంలో సర్పంచ్ మాకిరెడ్డి విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జడ్పిటిసి గిరిబాబు, ఎంపిడిఒ డేవిడ్‌రాజులు సుమారు 250 మందికి ధృవపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ జి.ఆనంద్‌రావు, ఈఒపిఆర్‌డి రఘురాం, వైసిపి మండల యూత్ అధ్యక్షులు మాకిరెడ్డి రామకృష్ణనాయుడు, గొలుగొండ ఎంపిటిసి పాప సిబ్బంది పాల్గొన్నారు.


గొలుగొండలో ధ్రువపత్రాలు ఇస్తున్న అధికారులు